PRGI Reg No -“APTEL/26/A1193

నేటి

# శుభోదయ

ప్రతి క్షణం – ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...

శుభోదయ

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 107, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, ఆదివారం - 07 - జూన్ - 2026 , వెల రూ.5/-



## మిత్రదేశంపైనే గూఢచర్యం..
# ఇజ్రాయెల్‌పై అమెరికాకు అనుమానాలు?

ఢిల్లీ: అమెరికా రక్షణ శాఖ నిఘా సంస్థ (డీఐఏ) ఇటీవల అంతర్గతంగా ఒక హెచ్చరిక నోటీసును జారీ చేసింది. ఇజ్రాయెల్ తమ దేశ ఉన్నతాధికారులపై నిఘా వేసిందన్నది దాని సారాంశం. పశ్చిమాసియా వివాదాలపై అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వం తీసుకునే అంతర్గత నిర్ణయాలను దొంగిలించడానికి ఇజ్రాయెల్ ప్రయత్నిస్తోందని పెంటగాన్ అనుమానిస్తోంది. ఎన్‌బీసీ న్యూస్ ఈ షాకింగ్ నిజాలను బయటపెట్టింది. ఈ తాజా నివేదిక నేపథ్యంలో ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లే యూఎస్ అధికారులకు నిబంధనలను కఠినతరం చేశారు. ఉన్నత స్థాయి చర్చల కోసం వెళ్లేవాళ్లు సాధారణ ఫోన్లకు బదులుగా 'బర్నర్ ఫోన్లు', తాత్కాలిక కంప్యూటర్లను మాత్రమే వాడనున్నారు. హోటల్ గదుల్లో ఎలాంటి సున్నితమైన విషయాలను మాట్లాడొద్దని సూచించారు. ఇజ్రాయెల్ నిఘా సంస్థలు సమాచారాన్ని సేకరించడంలో చాలా దూకుడుగా వ్యవహరిస్తాయని ఇప్పటికే పేరుంది. అమెరికా, ఇజ్రాయెల్ మధ్య ఇరాన్ యుద్ధంపై వస్తున్న విభేదాలే ఈ తాజా వివాదానికి కారణం. ఇటీవల ఇరాన్‌తో కుదిరిన కాల్పుల విరమణ తర్వాత ట్రంప్ దౌత్యపరమైన చర్చలు జరుపుతున్నారు. కానీ ఇరాన్‌పై మళ్లీ సైనిక దాడులు చేయాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పట్టుబడుతున్నారు. ఇటీవల వీరిద్దరి మధ్య జరిగిన ఓ ఫోన్ సంభాషణలో ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని, నెతన్యాహును పిచ్చివాడు అని సంబోధించారని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే ఈ గూఢచర్య ఆరోపణలను వాషింగ్టన్‌లోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం తోసిపుచ్చింది. తమపై వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని వివరించింది. ఇజ్రాయెల్ ఎప్పుడూ అమెరికా ప్రభుత్వ అధికారులపై నిఘా పెట్టదని, తమ శత్రువులపై మాత్రమే నిఘా ఉంచుతుందని పేర్కొంది. అటు వైట్ హౌస్ కూడా ఈ వార్తలను అధికారికంగా ఖండించింది. అయినప్పటికీ ఇరుదేశాల మధ్య అంతర్గతంగా నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ఏపీలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు..
# దక్షిణ కోస్తా, రాయలసీమకు అలర్ట్

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వాతావరణ శాఖ తీపి కబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఏపీలోకి ప్రవేశించాయి. వాతావరణ శాఖ అధికారుల సమాచారం ప్రకారం... జూన్ 4న కేరళను తాకిన రుతుపవనాలు, అక్కడి నుంచి అత్యంత వేగంగా ముందుకు కదిలి ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లోకి అడుగుపెట్టాయి. రాబోయే కొన్ని రోజుల్లో ఇవి దక్షిణ కోస్తా జిల్లాలతో పాటు రాయలసీమ ప్రాంతమంతటా విస్తరించేందుకు వాతావరణ పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గత రెండు, మూడు రోజులుగా ఇప్పటికే తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. అయితే రుతుపవనాల రాకతో రాబోయే వారంలో ఏపీవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. గత కొన్ని రోజులుగా జనాలను హడలెత్తించిన భానుడి భగభగలు తగ్గి, ఉష్ణోగ్రతలు ఈ వర్షాలతో అదుపులోకి రానున్నాయి. మరోవైపు రుతుపవనాల ప్రవేశంతో రైతన్నల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడితే, ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సాగు పనులు.. ముఖ్యంగా వరి నారుమళ్లు, నాట్లు వేసే ప్రక్రియ ఎలాంటి ఆటంకం లేకుండా సజావుగా సాగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## సింగరేణిలో భారీ కుంభకోణం.. రూ.1,600 కోట్ల బొగ్గు
# మాయంపై న్యాయ విచారణకు కేటీఆర్ డిమాండ్

హైదరాబాద్: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ లో సుమారు రూ. 1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ. రామారావు (కేటీఆర్) సంచలన ఆరోపణలు చేశారు. ఈ భారీ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి కేటీఆర్ ఒక లేఖ రాశారు. సింగరేణిలోని పలు స్టాక్‌యార్డులలో బొగ్గు నిల్వల నిర్వహణలో తీవ్ర అవకతవకలు జరిగాయని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. రికార్డుల ప్రకారం బొగ్గుపై సెస్, ఆదాయపు పన్ను చెల్లించినప్పటికీ, క్షేత్రస్థాయి తనిఖీల్లో నిల్వల మధ్య భారీ వ్యత్యాసం కనిపించిందని వివరించారు. ఈ వ్యవహారం వెనుక బొగ్గును అక్రమంగా తరలించి బహిరంగ మార్కెట్‌లో విక్రయించిన భారీ కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. ఈ కుంభకోణం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ హస్తం ఉందని, లేదా బాధ్యులను కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేటీఆర్ విమర్శించారు. ఈ విషయంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి, కేంద్రంలోని బీజేపీ మంత్రులకు మధ్య లోపాయికారీ సంబంధాలు ఉన్నాయేమోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అందుకే కేంద్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ స్కామ్‌ను బయటపెట్టకుండా ఉండేందుకే తమ పార్టీ నేతలను అరెస్టు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

## లండన్‌లో భారత ప్రధాన న్యాయమూర్తి సభలో
# 'కాక్రోచ్' వ్యాఖ్యల కలకలం!

ఢిల్లీ: లండన్‌లోని బిర్క్‌బెక్ కాలేజీలో జూన్ 4న జరిగిన ఓ అంతర్జాతీయ సదస్సులో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ ప్రసంగానికి కొందరు ప్రేక్షకులు అంతరాయం కలిగించడం తీవ్ర కలకలం రేపింది. 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ – అంతర్జాతీయ చట్టాలు' అనే అంశంపై సీజేఐ తన ఉపన్యాసం ముగించిన తర్వాత 'క్వశ్చన్ అండ్ ఆన్సర్' సెషన్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సదస్సులో పాల్గొన్న కొందరు ప్రేక్షకులు.. భారత్‌లో భిన్నాభిప్రాయాలను, నిరసనలను అణచివేస్తున్నారంటూ సీజేఐని ప్రశ్నించే ప్రయత్నం చేశారు. అలాగే ఇటీవల ఆయన చేసిన 'కాక్రోచ్' (బొద్దింకలు) వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ నిలదీశారు. అయితే ఆ ప్రశ్నలు సదస్సు ప్రధానాంశానికి సంబంధించినవి కావని పేర్కొంటూ నిర్వాహకులు మధ్యలోనే జోక్యం చేసుకుని వారి మైకులను కట్ చేశారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై లండన్‌లోని భారత హైకమిషన్ తీవ్రంగా స్పందించింది. సీజేఐ హాజరైన ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో కొందరు ప్రదర్శించిన 'అభ్యంతరకరమైన ప్రవర్తన'ను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రకటన విడుదల చేసింది. ప్రజాస్వామ్యంలో ఏవైనా భిన్నాభిప్రాయాలు ఉంటే వాటిని సభ్యతతో, గౌరవప్రదమైన రీతిలో వ్యక్తపరచాలే తప్ప.. ఇలాంటి అంతరాయాలు కలిగించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని భారత్ స్పష్టం చేసింది. ఈ వివాదానికి ముందు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తన ప్రసంగంలో.. సాంకేతికత ఎంత వేగంగా విస్తరిస్తున్నప్పటికీ అది ఎప్పుడూ రాజ్యాంగ విలువలకూ, ప్రజాస్వామ్యానికి, మనుషుల గౌరవానికీ లోబడి జవాబుదారీగా ఉండాలని నొక్కిచెప్పారు. రాబోయే దశాబ్ద కాలంలో మనం తీసుకునే నిర్ణయాలే సాంకేతికత, స్వేచ్ఛ, న్యాయం మధ్య ఉండే సంబంధాన్ని శాసిస్తాయని పేర్కొన్నారు.

## గూగుల్‌తో ఎలాన్ మస్క్ భారీ డీల్..
# ఏకంగా 30 బిలియన్ డాలర్ల ఒప్పందం!

ఢిల్లీ: ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్, ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్పేస్‌ఎక్స్ మధ్య ఒక భారీ ఒప్పందం కుదిరింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకోవడానికే క్లౌడ్ కంప్యూటింగ్ సేవల కోసం స్పేస్‌ఎక్స్‌కు నెలకు 920 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 7,600 కోట్లు) చెల్లించేందుకు గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ అంగీకరించింది. ఈ ఒప్పందం 2026 అక్టోబర్ నుంచి 2029 జూన్ వరకు కొనసాగనుండగా, దీని మొత్తం విలువ దాదాపు 30 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఈ ఒప్పందం ప్రకారం గూగుల్ తమ ఏఐ సేవలకు అవసరమైన కంప్యూటింగ్ సామర్థ్యం కోసం స్పేస్‌ఎక్స్ నుంచి 110,000 ఎన్విడియా గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లను (జీపీయూ) యాక్సెస్ చేస్తుంది. వీటితో పాటు సెంట్రల్ ప్రాసెసింగ్ యూనిట్లు (సీపీయూ), మెమరీ, ఇతర కీలక భాగాలను కూడా వినియోగించుకోనుంది. ఎన్విడియా ౹200 చిప్‌ల సామర్థ్యం ఆధారంగా చూస్తే, ఈ ఒప్పందం ద్వారా అందే కంప్యూటింగ్ పవర్ 100 మెగావాట్లకు పైగా ఉంటుందని, ఇది ఒకే సమయంలో 75,000 ఇళ్లకు విద్యుత్తును అందించగల శక్తితో సమానమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. తమ ఏఐ సేవలకు, ముఖ్యంగా 'జెమిని ఎంటర్‌ప్రైజ్' ప్లాట్‌ఫామ్‌కు అనూహ్యంగా పెరిగిన డిమాండ్‌ను తట్టుకోవడానికే ఈ ఒప్పందం చేసుకున్నట్లు గూగుల్ క్లౌడ్ ప్రతినిధి తెలిపారు. ఇది ఒక స్వల్పకాలిక, సమయానుకూల ఒప్పందమని, పెరిగిన కస్టమర్ల డిమాండ్‌కు అనుగుణంగా తాత్కాలిక సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ఇది దోహదపడుతుందని వివరించారు. ఒప్పందంలో భాగంగా 2026 సెప్టెంబర్ 30 నాటికి స్పేస్‌ఎక్స్ ఈ చిప్‌లను అందించడంలో విఫలమైతే, ఒప్పందాన్ని రద్దు చేసుకునే హక్కు గూగుల్‌కు ఉంటుంది. ఇదివరకే స్పేస్‌ఎక్స్, ఆంత్రోపిక్ పీబీసీ అనే మరో సంస్థతోనూ ఇలాంటి ఒప్పందమే కుదుర్చుకుంది. ఎలాన్ మస్క్‌కు చెందిన మరో సంస్థ ఎక్స్‌ఏఐ కూడా సొంతంగా డేటా సెంటర్లను నిర్మిస్తోంది. కాగా, స్పేస్‌ఎక్స్‌లో గూగుల్‌కు సుమారు 5% వాటా ఉండటం గమనార్హం. ఈ తాజా డీల్, ఏఐ రంగంలో కంప్యూటింగ్ పవర్‌కు ఎంతటి ప్రాధాన్యం ఉందో స్పష్టం చేస్తోంది.

## జనసేన తరపున రాజ్యసభ బరిలోకి
# లింగమనేని రమేష్.. నామినేషన్ దాఖలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. రాజ్యసభ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిగా లింగమనేని రమేష్ అసెంబ్లీలో తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. జనసేన పార్టీ తరపున రాజ్యసభ రేసులోకి ఒక అభ్యర్థి అధికారికంగా ఎంట్రీ ఇవ్వనుండటం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ నామినేషన్ ప్రక్రియ అధికార ఎన్డీఏ కూటమిలోని మూడు భాగస్వామ్య పార్టీల మధ్య ఉన్న బలమైన ఐక్యతను స్పష్టం చేసింది. లింగమనేని రమేష్ నామినేషన్‌ను సమర్థిస్తూ ఆరుగురు జనసేన ఎమ్మెల్యేలు, ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలు, ఒక బీజేపీ ఎమ్మెల్యే సంతకాలు చేశారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో కూటమికి చెందిన ఎమ్మెల్యేలు ఆయనకు మద్దతుగా పెద్ద సంఖ్యలో అసెంబ్లీకి తరలివచ్చారు. వీరిలో నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర, బొలిశెట్టి శ్రీనివాస్ నాయక్, వంశీకృష్ణ శ్రీనివాస్, పులపర్తి రామాంజనేయులు, దేవా వరప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, నక్కా ఆనంద్ బాబు, బీజేపీ ప్రతినిధి ఎన్. ఈశ్వర్ రావు తదితరులు ఉన్నారు. మరోవైపు, మిగిలిన మూడు రాజ్యసభ స్థానాలకు టీడీపీ అభ్యర్థులు నామినేషన్ వేయనున్నారు. టీడీపీ అభ్యర్థుల పేర్లు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది.

## 2029 ఎన్నికల్లోనూ
# మిమ్మల్ని ఓడిస్తాం

మొదటి పేజి తరువాయి

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో తీవ్రంగా నష్టాలు, కష్టాలు ఎదుర్కొంటున్న నా సోదర సోదరీమణుల ఆవేదనను తెలుసుకున్నా. మీ అందరికీ గుర్తుండే ఉండొచ్చు. 2009లో ఒక నాయకుడు ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని.. కరీంనగర్‌లో ఓడిపోతానని.. అక్కడి నుంచి ఇక్కడకు వచ్చారు. తెలంగాణ ఉద్యమం పేరు చెప్పి.. పాలమూరు జిల్లా వలసలు, రైతుల ఆత్మహత్యలు, కాలిపోతున్న మోటార్లు, పేలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లను ప్రస్తావించి పాలమూరు ఎంపీగా గెలిపించాలని కోరారు. వలసల కష్టాలు, ఆత్మహత్యల నష్టాలు మనకు తెలుసు. వాటిని పార్లమెంటులో చెబుతారనే నమ్మకంతో.. కరీంనగర్ నుంచి రాజకీయంగా వలస వచ్చిన కేసీఆర్‌ను మనం గుండెల్లో పెట్టుకొని అందరం కష్టపడి గెలిపించుకున్నాం. గెలిచిన కేసీఆర్ ఐదేళ్లు ఎంపీగా ఉన్నా.. కనీసం ఐదుసార్లు కూడా మన జిల్లాకు రాలేదు. అయినా మనమేమీ బాధపడలేదు. దేవుడు కరుణించాడు. సోనియమ్మ ఆశీర్వదించారు. మన్మోహన్‌సింగ్ చట్టం తెచ్చారు. జూన్ 2, 2014న తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారు.

**కేసీఆర్ రాసిపెట్టుకోండి.. మీ పార్టీని మళ్లీ మొలకెత్తనీయం**

"కేసీఆర్ రాసి పెట్టుకోండి.. ఏ ఊర్లో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారో.. ఆ ఇళ్లు కట్టిన చోటే మీరు ఓట్లు అడగాలి. ఇందిరమ్మ ఇళ్లు కట్టిన చోటే మేము ఓట్లు అడుగుతాం. ఇళ్లు, రిజర్వాయర్లు ఇస్తామని చెప్పి మోసం చేసి.. ఇప్పుడు ఇక్కడి అభివృద్ధిని అడ్డుకుంటారా? అభివృద్ధిని అడ్డుకుంటే.. పాలమూరు జిల్లాలో మీ పార్టీని మళ్లీ మొలకెత్తనీయం. మీ జెండా ఎగరనీయం. భవిష్యత్‌లో మీ పార్టీ గుర్తు మీద ఒక్క ఎమ్మెల్యేను కూడా గెలవనీయం. 2029 ఎన్నికల్లోనూ ఓడిస్తాం. కాంగ్రెస్‌ను తిరిగి అధికారంలోకి తీసుకొస్తాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 'మీ పదేళ్ల పాలనలో.. మా రెండున్నరేళ్ల పాలనలో ఏం చేశామో.. అసెంబ్లీలో చర్చిద్దామా? కేసీఆర్.. మీరు అసెంబ్లీకి రండి. చర్చలో నేను ఓడితే.. అక్కడికక్కడే క్షమాపణ చెబుతా. లేకపోతే మీరు ఫామ్‌హౌస్‌కే పరిమితం కండి' అని సీఎం రేవంత్.. భారాస అధినేతకు సవాల్ విసిరారు. "రేవంత్‌రెడ్డి ఏం చేశారని కొందరు అవాకులు చవాకులు పేలుతున్నారు. వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు.. ఒక్క రేషన్ కార్డు ఇచ్చారా? ఒక్క ఇల్లు కట్టిచ్చారా? ఉచిత కరెంటు ఇచ్చారా? ఉచిత బస్సు సౌకర్యం కల్పించారా? మా ప్రభుత్వం వచ్చాక.. 15 లక్షల రేషన్‌కార్డులు ఇచ్చాం. 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం. రూ.10వేల కోట్లు మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ఇచ్చాం. 1,000 బస్సులకు మహిళలను యజమానులను చేశాం. 67,616 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీచేశాం. రూ.20,616 కోట్ల రుణమాఫీ, రూ.27వేల కోట్ల రైతుభరోసా అందించాం.

ఆయన.. తర్వాత కొడుకు.. ఆ తర్వాత మనవడు రాజ్యం ఏలుతారట!

ఇక ఏ తెలంగాణ బిడ్డ మరణించొద్దు.. ఏ తల్లీ కడుపుకోత అనుభవించొద్దు అని.. ఆ తల్లుల దుఃఖాన్ని ఆపాలని ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ చచ్చిపోయినా.. రాజకీయ స్వార్థాన్ని వదిలేసి సోనియా ధనిక రాష్ట్రంగా తెలంగాణను అప్పగించారు. కానీ కేసీఆర్ మోసాన్ని గుర్తించలేని తెలంగాణ ప్రజలు.. రెండుసార్లు ఆయన్ను ముఖ్యమంత్రిని చేశారు. పదేళ్లలో పాలమూరు జిల్లాలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తిచేయలేదు. ఉదండాపూర్ మునిగితే రూ.800 కోట్లు ఇవ్వలేదు. మన కష్టాలు తీర్చలేదు. మన కన్నీళ్లు తుడవలేదు. మనకు సాగునీరు రాలేదు. తాగునీరు దక్కలేదు. కేసీఆర్‌ను ఈ వేదికపై నుంచి అడుగుతున్నా.. ఆనాడు ప్రారంభించిన జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిల సాగర్, కల్వకుర్తి, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాల్లో ఏ ఒక్క ప్రాజెక్టు అయినా.. మీరు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పూర్తిచేయలేదు? ఆయన.. తర్వాత ఆయన కొడుకు.. ఆ తర్వాత ఆయన మనవడు రాజ్యం ఏలుతారట! మనమేమో చేపలు పట్టుకుంటూ.. చెప్పులు కుట్టుకుంటూ బతకాలట!

## డీఎస్సీపై 'గొడ్డలి పార్టీ' దుష్ప్రచారాన్ని
# ఆధారాలతో తిప్పికొట్టాం

మొదటి పేజి తరువాయి

ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగానే నిర్ణయాలు ఉంటాయని ఆయన తేల్చి చెప్పారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శిక్షణ పొందుతున్న క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో నిర్వహించిన 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో ఆయన పాల్గొని, పార్టీ భవిష్యత్ వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ఇకపై పార్టీకి ఓటమి లేదు, రాదు. ఆ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రజలతో మంచిగా ఉంటున్నాం, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నాం, సంక్షేమం–అభివృద్ధి రెండు కళ్లుగా పనిచేస్తున్నాం. అన్నింటికీ మించి ఆత్మవిమర్శ చేసుకుంటున్నాం. అందుకే ఓటమి మన దరికి చేరదు. రాష్ట్రం, పార్టీ శ్రేయస్సు కోసం తప్పులు చేసిన వారిని, తేడాగా ఉన్నవారిని వదిలించుకోవడానికి వెనుకాడను" అని స్పష్టం చేశారు. గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచిస్తూ, మంగళగిరి నియోజకవర్గాన్ని ఉదాహరణగా చూపారు. "మంగళగిరిలో పార్టీ గెలిచి చాలా కాలమైంది. 2019లో లోకేష్ ఓడినా పట్టు వదలకుండా పనిచేసి, 2024లో అద్భుత విజయం సాధించారు. ఇప్పుడు ఆ నియోజకవర్గాన్ని టీడీపీకి కంచుకోటగా మార్చారు. అందరూ లోకేష్‌లా పనిచేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. మంచి సంకల్పంతో పనిచేస్తే దానికి తగ్గ వాతావరణం దానంతట అదే ఏర్పడుతుందని, 'ది సీక్రెట్' పుస్తకాన్ని ప్రతి కార్యకర్తా చదవాలని సూచించారు.

**'గొడ్డలి పార్టీ' చేతులెత్తేసింది**

గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "మద్యపానం నిషేధం, సీపీఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్ వంటి హామీలిచ్చి 'గొడ్డలి పార్టీ' చేతులెత్తేసింది. వారు చెప్పినవి చేయకపోగా, మేం నిర్వహిస్తున్న డీఎస్సీ–2025పై బురదజల్లారు. వివేకా హత్య విషయంలో ఎలా దుష్ప్రచారం చేసి లబ్ధి పొందారో, డీఎస్సీ విషయంలోనూ అదే ప్రయత్నం చేశారు. కానీ మేం ఆధారాలతో సహా కౌంటర్ ఇవ్వడంతో వారు డిఫెన్స్‌లో పడ్డారు. ఫేక్ రాజకీయాలు చేయడమే గొడ్డలి పార్టీ సిద్ధాంతం" అని ఆయన విమర్శించారు. తాము అధికారంలో ఉన్నందున సహనంతో ఉంటామని, అయితే ప్రతిపక్షం ఆగడాలు శ్రుతి మించితే సహించేది లేదని హెచ్చరించారు. కూటమి ధర్మాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. "కూటమిగా వెళ్లాం కాబట్టే 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిచాం. ఓట్లు చీలకూడదనే బీజేపీతో పొత్తులో ఉన్నా టీడీపీతో కలుస్తానని పవన్ కల్యాణ్ చెప్పారు. ఈ స్ఫూర్తిని క్షేత్రస్థాయిలో కార్యకర్తలు కొనసాగించాలి" అని సూచించారు. "యుద్ధాన్ని గెలిపించే బాధ్యత నాది, నాతో పాటు అలుపెరగకుండా యుద్ధం చేసే బాధ్యత మీది. రాష్ట్రంలోని ప్రతి బూత్‌లో గతానికి మించి ఓట్లు రావాలి" అని శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను గడప గడపకు వెళ్లి వివరించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని ప్రజలకు గుర్తు చేయాలని ఆదేశించారు.

## మన్యం జిల్లా పెదపెంకిలో అభివృద్ధి పనులపై
# డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష

మొదటి పేజి తరువాయి

తరచూ ప్రజలు ప్రమాదకర జ్వరాల భారిన పడుతుండటంతో పవన్ అక్కడి సమస్యలపై దృష్టి పెట్టారు. గ్రామంలో పారిశుద్ధ్యం సరిగా లేకపోవటమే అన్ని సమస్యలకు మూలమని అధికారులు గుర్తించారు. గ్రామంలో మురుగునీరు వెళ్లే మార్గాలు సరిగా లేకపోవటంతోపాటు, కొన్నిచోట్ల కాలువలు అక్రమణలకు గురయ్యాయి. అక్కడి ప్రజలతో మాట్లాడి అక్రమణలు తొలగించి గ్రామంలో మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మిస్తున్నట్లు అధికారులు పవన్‌కు వివరించారు. గ్రామస్థుల నుంచి మొదట్లో ప్రతిఘటన ఎదురైనా... వారిని ఎలాగోలా ఒప్పించి అక్రమణలు తొలగించి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సామాజిక సమస్యలు ఉన్నప్పటికీ.. వాటిని అధిగమించి పనులు ముందుకు తీసుకెళ్లిన జిల్లా పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను డిప్యూటీ సీఎం అభినందించారు. ఈనెల 24న పెదపెంకి గ్రామానికి వచ్చి మ్యాజిక్ డ్రెయిన్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తానని తెలిపారు.

## భారత్‌పై ఆంక్షలు పెడితే..
# అవి మీకే ఎదురుదెబ్బలవుతాయ్

మొదటి పేజి తరువాయి

రష్యాతో సంబంధాల విషయంలో కూడా ముందు అలాగే వ్యవహరిస్తుందన్నారు. ఆంక్షల రూపంలో భారత్‌ను ఇబ్బందిపెడితే.. అవి తిప్పికొడతాయంటూ పశ్చిమదేశాలకు చురకలు అంటించారు. "భారత్ సార్వభౌమాధికార దేశం. ప్రధాని మోదీ నాయకత్వంలోని భారత్‌కు ఆంక్షల పేరిట ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే... అవి వారికే ఎదురుదెబ్బలవుతాయి. అక్కడి ప్రజలకు అనుకూలమైన ఉత్పత్తులను ఎంచుకోవడానికి ఆ దేశానికి స్వేచ్ఛ ఉంది. ఎవరు ఎలాంటి వ్యాఖ్యలు చేసినా.. భారత్ తన వ్యూహాత్మక అవసరాలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకుంటోంది'' అని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరుగుతోన్న ఆర్థిక సదస్సులో పుతిన్ మాట్లాడారు. ఎస్‌యు 57, ఎస్–500 వంటి రష్యా రక్షణ ఉత్పత్తులను భారత్ ఒకవేళ కొనుగోలు చేస్తే.. అమెరికా నుంచి ఆంక్షలు ఎదురుకావొచ్చేమోనని అడిగిన ప్రశ్నకు పుతిన్ బదులిచ్చారు. జాతీయ ప్రయోజనాలకు అనుగుణమైన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని భారత్ అవలంబిస్తోందని పేర్కొన్నారు.

**భారత్‌కు సు-57 స్టెల్త్ ఫైటర్ జెట్లు..సంసిద్ధత వ్యక్తంచేసిన పుతిన్**

ఇదిలాఉంటే.. భారత్–అమెరికా మధ్య ట్రేడ్ డీల్‌కు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి. ఆ క్రమంలోనే భారత్‌లో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పర్యటించారు. భారత్ తమకు కీలక భాగస్వామి అని పేర్కొన్నారు. అనంతరం అమెరికా వెళ్లిన ఆయన మన దేశాన్ని ఇబ్బందిపెట్టేలా వ్యాఖ్యలు చేశారు. రష్యా చమురుపై ఇచ్చిన మినహాయింపులను వీలైనంత త్వరగా తొలగించాలని భావిస్తున్నట్లు తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభం వేళ.. ఆ చమురు భారత్‌కు కీలకమన్న సంగతి తెలిసిందే.

# ఏపీ సీఎం చంద్రబాబుతో రేవంత్ రెడ్డి కుమ్మక్కయ్యారు

మొదటి పేజి తరువాయి

బీఆర్‌ఎస్ చేపట్టబోయే పాదయాత్ర భయంతోనే సీఎం రేవంత్ రెడ్డికి నిద్ర కరువైందని, సాగునీటి ప్రాజెక్టులపై తమను విమర్శించే నైతిక హక్కు ఆయనకు లేదని స్పష్టం చేశారు. "అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరుకు చేసిందేమీ లేదు. సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుతో కుమ్మక్కై తెలంగాణకు తీవ్ర ద్రోహం చేస్తున్నారు. అందుకే ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ 75 శాతం కృష్ణా నీటిని వాడుకుంటే, తెలంగాణ కేవలం 25 శాతానికే పరిమితమైంది" అని హరీశ్ రావు ఆరోపించారు. ఈ వైఫల్యానికి గానూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో పాలమూరు పరిధిలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని గుర్తుచేశారు. పాలమూరు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా మోసం చేసిందని, రాబోయే రోజుల్లో కొడంగల్‌లో రేవంత్ రెడ్డిని మళ్లీ ఓడించి, పాలమూరు గడ్డపై గులాబీ జెండా ఎగరేస్తామని హరీశ్ రావు ధీమా వ్యక్తం చేశారు.

## ప్రపంచ స్థాయి 'బే సిటీ'గా విశాఖ..
# సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

విశాఖపట్నం: విశాఖపట్నం నగరాన్ని 'బే సిటీ'గా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణను తక్షణమే చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ (వీఈఆర్)పై తొమ్మిది జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. విశాఖలోని కైలాసగిరి నుంచి భోగాపురం వరకు ఈ బే-సిటీ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని సూచించారు. వీఈఆర్ పనుల పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఒక ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గ్రేహౌండ్స్ పరిధిలోని 303 ఎకరాల స్థలంలో అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించాలని ఆదేశించారు. అలాగే, కైలాసగిరి ప్రాంతాన్ని అటు ఆధ్యాత్మికంగా, ఇటు పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేయాలని దిశానిర్దేశం చేశారు. అన్ని వర్గాల ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా బీచ్ వాటర్ స్పోర్ట్స్, వినోదాత్మక ప్రాజెక్టుల ఏర్పాటుకు అవసరమైన పెట్టుబడులను ఆహ్వానించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. విశాఖలోని జంతు ప్రదర్శనశాలను ఆధునీకరించి, పర్యాటకులను విశేషంగా ఆకర్షించేలా తీర్చిదిద్దాలని సూచించారు. నగరంలోని ఎర్రమట్టి దిబ్బలు, బౌద్ధ క్షేత్రాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని వెల్లడించారు. రాజమహేంద్రవరంలోని అఖండ గోదావరి ప్రాజెక్టుతో పాటు పోలవరం, పాపికొండలు వంటి ప్రాంతాలు పర్యాటక రంగానికి అదనపు ఆకర్షణగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన ద్వారా భారీ ఎత్తున పర్యాటక ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. పారిశ్రామిక ప్రాంతాలను ఆనుకుని నిర్మించే టౌన్‌షిప్‌ల అభివృద్ధిపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నీతి ఆయోగ్ సమర్పించిన వీఈఆర్ ప్రాజెక్టు నివేదికపై ప్రజల్లో విస్తృత చర్చ జరగాలని, ముఖ్యంగా విద్యార్థులు, మేధావుల నుంచి విలువైన అభిప్రాయాలు, ఆలోచనలను స్వీకరించాలని సీఎం కోరారు. ఈ సమీక్షా సమావేశంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు కిమిడి అచ్చెన్నాయుడు, డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, విశాఖ జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరి వరకు గల తొమ్మిది జిల్లాల కలెక్టర్లతో పాటు వీఈఆర్ కన్వీనర్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సౌరభ్ గౌర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, విశాఖ జిల్లా కలెక్టర్ హరీష్ అభిషిక్త్ కిషోర్ తదితరులు హాజరయ్యారు.

## కోటిచెరువు భూమిని వెంటనే వెనక్కివ్వు
# పవన్ కల్యాణ్‌పై కవిత ఫైర్

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో భూకబ్జాల వ్యవహారం ఇప్పుడు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వర్సెస్ కవితగా మారి సరికొత్త వివాదానికి తెరలేపింది. హైదరాబాద్‌లోని 'కోటిచెరువు' శిఖం భూమిని పవన్ కల్యాణ్ కబ్జా చేశారంటూ టీఆర్‌ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. జూబ్లీహిల్స్‌లోని పార్టీ ఆఫీస్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆమె మాట్లాడుతూ.. పవన్ గనుక ఆ భూమిని ఆక్రమించలేదని చెబితే, వెంటనే ఆ స్థలాన్ని తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించి, అక్కడి నిర్మాణాలను, మట్టిని తొలగించాలని డిమాండ్ చేశారు. నీటిపారుదల శాఖ రికార్డుల ప్రకారం ఆ 10 ఎకరాల భూమి పూర్తిగా 'శిఖం' (ప్రభుత్వ) భూమి అని కవిత స్పష్టం చేశారు. కానీ రిజిస్ట్రేషన్ సమయంలో కేవలం 3 ఎకరాలను మాత్రమే శిఖం భూమిగా చూపి, మిగిలిన 7 ఎకరాలను 'మాగాణి' (ప్రైవేట్) భూమిగా మార్చేశారని.. ఇది స్పష్టమైన నిబంధనల ఉల్లంఘనే అని ఆమె ఎండగట్టారు. ఇటీవల పవన్ చేసిన "తెలంగాణ మీ అబ్బ సొత్తా.. మీ జాగీరా?" అనే వ్యాఖ్యలపై కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. "అవును, ఇది కచ్చితంగా మా జాగీరే! 1,200 మంది అమరవీరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ ఇది. ఇది తెలంగాణ ప్రజల సొత్తు, ఎవరి ముత్తాతలదో కాదు" అని కవిత ప్రతిస్పందించారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజధానిని కూడా నిర్మించలేకపోయిన పవన్.. ఇప్పుడు తెలంగాణలో కేవలం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీకి సరైన స్థానిక నాయకులు లేకపోవడం వల్లే పవన్‌ను వాడుకుంటున్నారని విమర్శించారు. ప్రజా గాయకుడు గద్దర్‌కు తాను కారు కొనిచ్చి సాయం చేశానన్న పవన్ వ్యాఖ్యలను కూడా కవిత తప్పుబట్టారు. నైజాం ఏరియా నుంచి తన సినిమాల ద్వారా కోట్లాది రూపాయల రెవెన్యూ సంపాదిస్తున్న పవన్.. ఇక్కడి జానపద కళాకారులను గానీ, చిన్న నిర్మాణాత్మక శక్తులను గానీ ఎప్పుడైనా ఆదుకున్నారా? అని ప్రశ్నించారు. పైగా జానపద కళాకారుల ట్యూన్లను వాడుకుంటూ వారికి కనీస గుర్తింపు ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కవిత తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా ఆమె ఒక ఆసక్తికరమైన పోలికను తెరపైకి తెచ్చారు. "అప్పట్లో కూటీర్ (కేసీఆర్, టి. హరీశ్ రావు, రామారావు (కల్వకుంట్ల తారకరామారావు) పాలన అనుకుంటే.. ఇప్పుడు కూడా నడుస్తోంది ఖు= (కొండారెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి) పాలనే" అంటూ వ్యంగ్యంగా కామెంట్ చేశారు. గతంలో దోపిడీకి కిటికీలు తెరిస్తే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా తలుపులే బార్లా తెరిచిందని ఆరోపించారు. ప్రభుత్వ భూములను ఇలాగే అమ్మేసుకుంటూ పోతే రాబోయే తరాలకు ఏమీ మిగలదని, ఈ ల్యాండ్ స్కామ్‌లన్నింటినీ తాము త్వరలోనే బయటపెడతామని కవిత హెచ్చరించారు.

# పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. ప్రధాని మోదీ కీలక భేటీ

ఢిల్లీ: పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఆర్థిక సలహా మండలితో ప్రధాని నరేంద్ర మోదీ సమావేశం నిర్వహించారు. భారత్‌పై యుద్ధ ప్రభావం తగ్గించే చర్యలపై కసరత్తు, ప్రపంచవ్యాప్త అస్థిరతల మధ్య భారతదేశ ఆర్థిక వృద్ధిని మరింత పెంపొందించడానికి వివిధ ఆలోచనలు, చర్యలపై చర్చలు జరిపారు. ఆర్థికవృద్ధిని బలోపేతం చేయడంతో పాటు అంతర్జాతీయంగా వచ్చే ఒడుదొడుకులను తట్టుకునే సామర్థ్యం పెంపుదల, వాణిజ్యానికి మరింత అనుకూల వాతావరణాన్ని కల్పించేలా సంస్కరణలను వేగవంతం చేయడం వంటి అంశాలపై చర్చించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ప్రపంచ ఆర్థిక ఒడిదుడుకుల సమయంలో భారత్ ఆర్థిక వృద్ధిని మరింతగా ఎలా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై వివిధ వ్యూహాలను, చర్యలను చర్చించారని వారు పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ ప్రమాదకర స్థాయికి చేరుకున్న సంగతి తెలిసిందే. హర్మూజ్ జలసంధిలో అమెరికా దళాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ డ్రోన్ల దాడికి దిగింది. అయితే వాటిని తిప్పి కొట్టడంతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. అంతటితో ఆగకుండా ఇరాన్‌కు చెందిన తీర ప్రాంత రాడార్ కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులు నిర్వహించింది. ఇప్పటికే సున్నితంగా మారిన గల్ఫ్ ప్రాంతంలో తాజా పరిణామాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. హర్మూజ్ జలసంధి వద్ద ప్రారంభమైన ఈ తాజా ప్రతిష్ఠంభన ఎటు దారి తీస్తుందనేది ఇప్పుడు ప్రపంచ దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ప్రపంచ చమురు ధరలు, అంతర్జాతీయ వాణిజ్యం, పశ్చిమాసియా భద్రతా పరిస్థితులపై కూడా ఈ ప్రభావం పడే అవకాశం ఉంది.

# పంచె కట్టుకున్నోళ్లంతా రాజశేఖరరెడ్డి కాదు..

హైదరాబాద్: 'పాలమూరు' ప్రాజెక్టును కొలిక్కి తీసుకురావడానికి నేను ప్రయత్నిస్తుంటే రాజకీయ కార్యాచరణ తీసుకుంటాం అని వారు (బీఆర్‌ఎస్) బయలుదేరారు. ఒకాయన పంచె కట్టుకొని రాజశేఖరరెడ్డి అనుకుంటడు. పంచె కట్టుకున్నోళ్లంతా రాజ శేఖరరెడ్డి అయితే బానే ఉండే. ఇంటి పేరు మార్చుకున్నడు ఇంకొకాయన. ప్రజలు చీదరించుకుంటారనే సోయి కూడా లేకుండా మా గురించి మాట్లాడి జిల్లాకు అన్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నారు' అని రేవంత్ విమర్శించారు. 'పక్క రాష్ట్రం (ఏపీ)తో చర్చలు జరుగుతున్నాయి. తొందర్లోనే వాటిని (జల వివాదాలను) పరిష్కరించుకుంటాం. మీకు తొందర్లోనే మంచి వార్త వినపించబోతున్నా. ముందు మాకు పాలమూరు––రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులకు నూటికి నూరు శాతం నికర జలాలను ఇస్తే సముద్రంలో పోయే నీళ్ల గురించి ఏపీతో మాట్లాడతాం. కృష్ణా జలాల పంపిణీ అంశం బచావత్ ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉంది. తెలంగాణకు 299 టీఎంసీల కృష్ణా జలాలు చాలు.. మీరు (ఏపీ) 512 టీఎంసీలు తీసుకెళ్లండని కేసీఆర్ సంతకాలు చేసి కృష్ణా పరీవాహక ప్రాంతానికి శాశ్వతంగా మరణశాసనం రాసిండు. ఆ మరణశాసనాన్ని తిరగరాయడం చెప్పలేనంత సంక్లిష్టంగా ఉంది. అందుకే పాలమూరు––రంగారెడ్డి ప్రాజెక్టుకు 90 టీఎంసీలు, డిండి ప్రాజెక్టుకు 20 టీఎంసీల నికర జలాల కేటాయింపులకు అంగీకరిస్తూ ఏపీ నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) ఇస్తేనే ఏపీ ప్రాజెక్టులపై చర్చిస్తాం. లేకపోతే చర్చించే సమస్యే లేదు' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 'గోదావరిలో తెలంగాణకు ఉన్న 968 టీఎంసీల నికర జలాల్లో ఒక చుక్కకే రాజీపడం. వ్యూహాత్మక ఎత్తుగడలతో ప్రతి చుక్క నీటి హక్కునూ కాపాడే బాధ్యత నేను, మంత్రి ఉత్తమ్ తీసుకుంటాం. పాలమూరు––రంగారెడ్డి ప్రాజెక్టుకు ఎన్‌వోసీ ఇస్తేనే పోలవరం––బనకచర్ల/నల్లమల్లసాగర్ ప్రాజెక్టుపై మాట్లాడటానికి ఉంటుందని కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శితో ఏపీకి చెప్పించాం. పాలమూరుకు 90 టీఎంసీల కేటాయింపులను సైతం తీసుకొస్తాం. డిసెంబర్‌లోగా చర్చల ద్వారా జిల్లాకు సంబంధించి కృష్ణా జలాల విషయంలో మెజారిటీ సమస్యలు పరిష్కరిస్తాం. ప్రాజెక్టులు కట్టుకొని మనం 968 టీఎంసీలను వాడుకున్న తర్వాతే సముద్రంలో పోయే నీళ్ల లెక్క తేలుతుంది. 968 టీఎంసీలను మనం భద్రం చేసుకొని మిగిలిన దాని (వరద జలాలు) గురించి మళ్లీ చర్చ చేస్తాం. గోదావరిలో ఏపీకి ఉన్న 516 టీఎంసీలను వాళ్లు ఎక్కడ వాడుకుంటారో వారిష్టం. అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

'కేసీఆర్ పదేళ్ల పాలనలో పాలమూరు––రంగారెడ్డి ప్రాజెక్టుపై రూ. 27 వేల కోట్లు ఖర్చు చేసిండు. అందులో అధిక భాగం పంపులు, లిఫ్టులకే ఇచ్చి రూ. వేల కోట్ల కమీషన్లు కొల్లగొట్టి ఎకరాకు కూడా నీళు ఇవ్వకుండా ఎక్కడికక్కడ వదిలేసిపోయిండు. వాళ్లలాగా కమీషన్లు, కాంట్రాక్టుల కోసం పనిచేసే వాడిని కాదు. 20 ఏళ్లలో జెడ్పీటీసీ సభ్యుడి నుంచి సీఎం వరకు జిల్లాలో రూ. వేల కోట్ల పనులు జరిగినా ఒక్క రోజైనా నాపై చిన్న ఆరోపణ అయినా వచ్చిందా?' అని రేవంత్ ప్రశ్నించారు.

PRGI Reg No -"APTEL/26/A1193

నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి.....

శుభోదయ

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 107, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, ఆదివారం - 07 - జూన్ - 2026 , వెల రూ.5/-




## ఏపీలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు.. దక్షిణ కోస్తా, రాయలసీమకు అలర్ట్

- జూన్ 4న కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు
- వేగంగా ముందుకు కదిలి నేడు ఏపీలో అడుగుపెట్టిన రుతుపవనాలు
- ఏపీలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

### డీఎస్సీపై 'గొడ్డలి పార్టీ' దుష్ప్రచారాన్ని

# ఆధారాలతో తిప్పికొట్టాం

### సర్వే చేస్తాం... తేడాగా ఉన్నవాళ్లను వదిలించుకుంటాం



- ★ క్యాడర్ కు చంద్రబాబు క్లారిటీ
- ★ పనితీరు ఆధారంగానే పార్టీలో గుర్తింపు ఉంటుందని చంద్రబాబు స్పష్టీకరణ
- ★ తప్పులు చేసేవారిని వదిలించుకుంటాం
- ★ లోకేష్ పట్టు దలతో పనిచేసి మంగళగిరిని టీడీపీకి కంచుకోటగా మార్చారని ప్రశంస

అమరావతి: తెలుగుదేశం పార్టీలో ఇకపై పనితీరే ప్రామాణికమని, తప్పులు చేసే వారిని, తేడాగా వ్యవహరించే వారిని వదిలించుకుంటామని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. పార్టీ పదవుల నుంచి ఎన్నికల టిక్కెట్ల కేటాయింపు వరకు నిరంతరం సర్వేలు చేయిస్తానని, మిగతా 2 లో

### మిత్రదేశంపైనే గూఢచర్యం.. ఇజ్రాయెల్‌పై అమెరికాకు అనుమానాలు?

ఇజ్రాయెల్ గూఢచర్యంపై పెంటగాన్ అనుమానాలు




- ఉన్నతాధికారులపై నిఘా పెట్టే అవకాశం ఉందని హెచ్చరిక
- ఇజ్రాయెల్ పర్యటనలో బర్నర్ ఫోన్లు వాడాలని అధికారులకు సూచన



### కోటిచెరువు భూమిని వెంటనే వెనక్కివ్వు

## పవన్ కల్యాణ్‌పై కవిత ఫైర్

- కోటి చెరువు శిఖం భూమిని పవన్ కబ్జా చేశారన్న కవిత
- తెలంగాణ ప్రభుత్వానికి భూమిని అప్పగించాలని డిమాండ్
- తెలంగాణ కచ్చితంగా తమ జాగీరేనని వ్యాఖ్య

2లో

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో భూకబ్జాల వ్యవహారం ఇప్పుడు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వర్సెస్ కవితగా మారి సరికొత్త

### 2029 ఎన్నికల్లోనూ

# మిమ్మల్ని ఓడిస్తాం

### చర్చలో నేను ఓడితే.. అక్కడికక్కడే క్షమాపణ చెబుతా

- ★ మీ పదేళ్ల పాలన.. మా ★ రెండున్నరేళ్ల పాలనపై సభలో చర్చిద్దామా?
- ★ లేదంటే మీరు ఫామ్‌హౌస్‌కే పరిమితం కండి
- ★ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చిన చోటే మీరు ఓట్లు అడగాలి
- ★ ఇందిరమ్మ ఇళ్లు కట్టిన చోటే మేము ఓట్లు అడుగుతాం



మహబూబ్‌నగర్: పాలమూరు బిడ్డనైన నేను రెండు రోజులుగా ఈ గడ్డపై.. విస్తృతంగా తిరిగా. ఇక్కడి తాగు, సాగునీటి అవసరాల కోసం.. పడావుపడిన ప్రాజెక్టులను పరిశీలించా. పరిష్కారాల కోసం యంత్రాంగానికి సూచనలిచ్చా. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగతా 2 లో




### సింగరేణిలో భారీ కుంభకోణం.. రూ.1,600 కోట్ల బొగ్గు మాయంపై న్యాయ విచారణకు కేటీఆర్ డిమాండ్

- సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైనట్లు కేటీఆర్ ఆరోపణ
- సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణకు డిమాండ్
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాసి విచారణ కోరిన కేటీఆర్



### జనసేన తరపున రాజ్యసభ బరిలోకి

## లింగమనేని రమేష్.. నామినేషన్ దాఖలు

- జనసేన తరపున తొలి రాజ్యసభ సభ్యుడిగా పెద్దల సభలోకి అడుగుపెట్టనున్న లింగమనేని
- అసెంబ్లీలో నేడు నామినేషన్ వేసిన లింగమనేని
- లింగమనేని సభ్యత్వాన్ని సమర్థిస్తూ సంతకాలు చేసిన కూటమి ఎమ్మెల్యేలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక కీలక పరిణామం మిగతా 2 లో

### లండన్‌లో భారత ప్రధాన న్యాయమూర్తి సభలో

## 'కాక్రోచ్' వ్యాఖ్యల కలకలం!




- ప్రసంగానికి అంతరాయం కలిగించిన నిరసనకారులు
- 'కాక్రోచ్' వ్యాఖ్యలపై నిలదీసినట్లు వీడియోలు వైరల్
- నిర్వాహకుల జోక్యంతో నిలిచిపోయిన ప్రశ్నల పర్వం

### మన్యం జిల్లా పెదపెంకిలో అభివృద్ధి పనులపై

## డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష

### ప్రజలు ప్రమాదకర జ్వరాల భారిన పడుతుండటంతో పవన్ అక్కడి సమస్యలపై దృష్టి

- గ్రామంలో పారిశుద్ధ్యం సరిగా లేకపోవటమే అన్ని సమస్యలకు మూలం
- ఈనెల 24న పెదపెంకి గ్రామానికి వచ్చి మ్యాజిక్ డ్రెయిన్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తాం



అమరావతి: పార్వతీపురం మన్యం జిల్లా పెదపెంకి గ్రామంలో అభివృద్ధి పనులపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. పెదపెంకి గ్రామంలో వందకు పైగా ఫైలేరియా కేసులు నమోదవటం, మిగతా 2 లో

### భారత్‌పై ఆంక్షలు పెడితే.. అవి మీకే ఎదురుదెబ్బలవుతాయ్

- పశ్చిమదేశాలకు పుతిన్ చురక
- రష్యాతో సంబంధాల విషయంలో కూడా ముందు అలాగే వ్యవహరిస్తుంది
- ఆంక్షల రూపంలో భారత్‌ను ఇబ్బందిపెడితే.. అవి తిప్పికొడతాయంటూ పశ్చిమదేశాలకు చురకలు
- అక్కడి ప్రజలకు అనుకూలమైన ఉత్పత్తులను ఎంచుకోవడానికి ఆ దేశానికి స్వేచ్ఛ ఉంది

ఢిల్లీ: భారతదేశానికి బయటి నుంచి ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినప్పటికీ.. తన జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగానే వ్యవహరించిందని రష్యా అధ్యక్షుడు పుతిన్ వ్యాఖ్యానించారు. రష్యాతో సంబంధాల విషయంలో కూడా మిగతా 2 లో



## ఏపీ సీఎం చంద్రబాబుతో రేవంత్ రెడ్డి కుమ్మక్కయ్యారు

### సాగునీటి ప్రాజెక్టులపై తమను విమర్శించే హక్కు రేవంత్ కు లేదన్న హరీశ్

- కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరుకు చేసిందేమీ లేదని వ్యాఖ్య
- ఈ ఏడాది 75 శాతం కృష్ణా నీటిని ఏపీ వాడుకుందని ఆరోపణ



హైదరాబాద్: పాలమూరు ప్రాజెక్టు సందర్భంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విమర్శలకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు గట్టి కౌంటర్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డివి "మతిలేని మాటలు" అంటూ ఆయన తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. నేడు ఓ న్యూస్ ఛానల్‌తో మాట్లాడిన హరీశ్ రావు... మిగతా 2 లో

### గూగుల్‌తో ఎలాన్ మస్క్ భారీ డీల్..

## ఏకంగా 30 బిలియన్ డాలర్ల ఒప్పందం!




- స్పేస్‌ఎక్స్‌తో గూగుల్ భారీ క్లౌడ్ ఒప్పందం
- నెలకు 920 మిలియన్ డాలర్లు చెల్లించనున్న గూగుల్
- ఏఐ సేవల కోసం 110,000 ఎన్విడియా జీపీయూల వినియోగం
- ఒప్పందం మొత్తం విలువ సుమారు 30 బిలియన్ డాలర్లు
- జెమిని ప్లాట్‌ఫామ్ డిమాండ్‌ను తట్టుకోవడానికే ఈ డీల్

నేటి శుభోదయ
ప్రతి క్షణం – ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



## కోరుకొండ నూతన తహసిల్దార్ గా 'సునీత' బాధ్యతలు స్వీకరణ..!



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ తహసిల్దార్గా సునీత బాధ్యతలు స్వీకరించారు. ఆమె సీతానగరం మండల డిప్యూటీ తహసిల్దార్ గా పనిచేస్తూ పదోన్నతిపై కోరుకొండ తహసిల్దార్ గా వచ్చారు. ఇంతవరకు ఇక్కడ తహశీల్దార్ గా బాధ్యతలు నిర్వహించిన సుగుణ కొవ్వూరు ఆర్డీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. నూతన తహసిల్దార్ సునీత ను, రిసర్వే డిప్యూటీ తహసిల్దార్ రజిని, రెవిన్యూ ఇన్స్పెక్టర్ రామిరెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## "నరేంద్ర మోడీ 12 ఏళ్ల పాలన అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఆదిలక్ష్మి"



తాడేపల్లిగూడెం జూన్ 6 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ):::: ప్రధాని నరేంద్ర మోడీ 12 ఏళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆదిలక్ష్మి పిలుపునిచ్చారు. భారతీయ జనతా పార్టీ తాడేపల్లిగూడెం పట్టణ సమావేశం స్థానిక గ్రీన్ ఏషియా కాంప్లెక్స్ లోని బిజెపి పట్టణ కార్యాలయంలో జరిగింది. సమావేశానికి బిజెపి పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ 12 ఏళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ఈనెల 21వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రధానిగా భాధ్యతలు చేపట్టిన తరువాత ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా దేశ అభివృద్ధి కోసం పనిచేస్తున్న గొప్ప నేత నరేంద్ర మోడీ అని ప్రశంసించారు.పార్టీ నాయకులు కార్యకర్తలు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బిజెపి జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నవీన్ జి బాధ్యతలు చేపట్టిన తర్వాత క్షేత్ర స్థాయి నుంచి కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసి హాజరైన వారందరూ తప్పనిసరిగా సరళ యాప్ లోని డిజిటల్ అటెండెన్స్ చేయాల్సి ఉంటుంది అన్నారు. నరేంద్ర మోడీ పరిపాలన అమలు చేసిన వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల వివరాలను క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు తీసుకువెళ్లాలన్నారు. దీనికి సంబంధించిన పుస్తకాలు త్వరలో అందరికి అందుతాయి అన్నారు. బూతుస్థాయి నుంచి మండల, పట్టణ స్థాయి వరకు కమిటీలను మరింత పటిష్టం చేసి సమన్వయంతో ముందుకు తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయాన్నారు . బిజెపి పట్టణ ఇన్చార్జి గున్నేపల్లి పుల్లాజీ మాట్లాడుతూ దేశ అభ్యున్నతి లక్ష్యంగా పనిచేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం అగ్రదేశాల స్థాయిలో నిలిచిందన్నారు. గతంలో ప్రధాని జవహర్లాల్ నెహ్రూ రికార్డును అధిగమించి నరేంద్ర మోడీ ప్రభుత్వం కొనసాగుతోంది అన్నారు. పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలను క్రమం తప్పకుండా సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. పార్టీ సమావేశాలకు పదాధికారులు నాయకులు కార్యకర్తలు విధిగా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. సభాధ్యక్షులు బిజెపి పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాల సమగ్ర సమీక్ష కార్యక్రమం త్వరలో పట్టణంలో జరుగుతుశీదన్నారు. బూత్ స్థాయి ప్రతినిధులుగా నియమితులైన వారు తప్పనిసరిగా అధికారులతో కలిసి ఉంటే ఓటర్లను పరిశీలించి నిర్ధారించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇది ఎంతో ముఖ్యమైన కార్యక్రమం అని అధికారులతో కూటమి పార్టీల ప్రతినిధులతో సమన్వయంతో పని చేయాలన్నారు. నరేంద్ర మోడీ 12 ఏళ్ల పాలన పుట్టిన సందర్భంగా కార్యక్రమాల నిర్వహణ ప్రతినిధులుగా నియమితులైన పాటే నాగేశ్వరరావు 12 కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. మరో ప్రతినిధి ఇమ్మంది బెనర్జీ మాట్లాడుతూ నరేంద్ర మోడీ 12 ఏళ్ల విజయవంతమైన పాలన సందర్భంగా ఏర్పాటు అయినా కార్యక్రమాలు అందరూ సమన్వయంతో పాల్గొని విజయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, పదాధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖాట్మండు కళింగ సాహిత్య ఉత్సవంలో బి.పి. ఆచార్య కవితా సంకలనం ఆవిష్కరణ



ఖాట్మండు, నేపాల్: జూన్ 6. నేటి శుభోదయ: ప్రఖ్యాత ఖాట్మండు కళింగ సాహిత్య ఉత్సవం నాల్గవ ఎడిషన్ ప్రారంభోత్సవ వేడుకల్లో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, రచయిత బి.పి. ఆచార్య సంపాదకత్వం వహించిన "హశీవఎం ాఘశీఆశీం ుఅఎవ" కవితా సంకలనం అంతర్జాతీయ పాఠకుల కోసం అధికారికంగా ఆవిష్కరించబడింది. నేపాల్ మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీలా కార్కీ ఈ పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ విశిష్ట కార్యక్రమంలో ప్రముఖ ఒడియా రచయిత్రి, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ ప్రతిభా రాయ్తో పాటు భారత్, నేపాల్కు చెందిన పలువురు ప్రముఖ సాహితీవేత్తలు, కవులు, మేధావులు పాల్గొన్నారు. "హశీవఎం ాఘశీఆశీం ుఅఎవ" సంకలనం ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాల సాహిత్య వారసత్వాన్ని ప్రతిబింబించడం విశేషం. ఈ పుస్తకంలో బి.పి. ఆచార్య, ఆయన పెద్దన్నయ్య దివంగత డాక్టర్ డి.పి. ఆచార్య, అలాగే విదేశాల్లో స్థిరపడిన ఆయన మేనల్లుడు అన్షుమన్ రచించిన కవితలు చోటు చేసుకున్నాయి. విభిన్న కాలాలు, విభిన్న అనుభవాలు, భిన్న భౌగోళిక నేపథ్యాల నుంచి వచ్చిన ఈ కవితలు మానవ అనుభూతులు, కాల ప్రవాహం, కుటుంబ బంధాలు, జీవన తాత్వికత వంటి అంశాలను హృద్యంగా ఆవిష్కరిస్తాయి. మూడు తరాల సృజనాత్మక దృక్పథాలను ఒకే వేదికపై ఆవిష్కరించిన ఈ సంకలనం సమకాలీన ఆంగ్ల కవిత్వంలో ఒక విశిష్ట కృషిగా నిలుస్తుందని సాహితీవేత్తలు అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ పాఠకులను దృష్టిలో ఉంచుకుని ప్రచురించిన ఈ పుస్తకం ప్రస్తుతం అమెజాన్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉంది. ఖాట్మండు కళింగ సాహిత్య ఉత్సవం వంటి అంతర్జాతీయ వేదికపై ఈ పుస్తకం ఆవిష్కరణ జరగడం భారతీయ సాహిత్యానికి, ముఖ్యంగా ఒడిశా సాహిత్య సంప్రదాయానికి గర్వకారణంగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు.




## ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న చీఫ్ మినిస్టర్ ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ (క్యాబినెట్ మినిస్టర్ ర్యాంక్), రాజానగరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్..



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); ఈనెల 8వ తేదీన పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం సిద్ధాంతం గ్రామంలో రైతుల పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా విచ్చేస్తున్నారు. కాగా ఈ పర్యటన ఏర్పాట్లను చీఫ్ మినిస్టర్ ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ (క్యాబినెట్ మినిస్టర్ ర్యాంక్), రాజానగరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు పెందుర్తి వెంకటేష్ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యమంత్రి సభ నిర్వహణపై అధికారులకు పెందుర్తి వెంకటేష్ పలు సూచనలు, సలహాలతో కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు ఆదేశాలు ఇచ్చారు. ఆయనతోపాటు ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, వెస్ట్ గోదావరి ఎస్పీ, ఇతర జిల్లా స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ఈ నెల 8 వ తేదిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో జనసేన పార్టీ.. భారీ ఆత్మీయ సమ్మేళనం..!!??

– రాజానగరం నియోజకవర్గ జనసేన పార్టీ కుటుంబ సభ్యులందరికీ ఆహ్వానం...!!

– వేదిక..రాయల్ కన్వెన్షన్ హాల్, రాజానగరం...!

కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); రాజానగరం నియోజకవర్గ జనసేన పార్టీ కుటుంబ సభ్యులందరికీ ఆహ్వానం...!! ఈ నెల 8 వ తేదిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో జనసేన పార్టీ.. ఆత్మీయ సమ్మేళనం..!! వేదిక..రాయల్ కన్వెన్షన్ హాల్, రాజానగరం...! అనే అంశాలతో విడుదలైన రాజానగరం జనసేన పోస్టర్ ఈ ప్రాంతంలో సంచలనం సృష్టించిశీది. ఈ సభలో పార్టీ శ్రేణులకు పలు అంశాలపై ఎమ్మెల్యే బలరామకృష్ణ..దశా దిశా నిర్దేశం చేయనున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ముఖ్య ఉద్దేశం: 1, రాబోవు లోకల్ బాడీ ఎన్నికల్లో






అనుసరించాల్సిన వ్యూహం/అభ్యర్థుల కసరత్తు 2, పొత్తుధర్మం పాటిస్తూ, ఎన్డీయే మిత్ర పక్ష పార్టీలతో (తెలుగుదేశం, బిజెపి) సమన్వయంతో ముందుకు సాగేలా సమన్వయ సభ్యుల నియామకం/ 3, త్వరలో పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు నిర్మాణం జరుపుకోవడం.. పలు కమిటీల ద్వారా నాయకత్వ వ్యవస్థను మరింత బలంగా తీర్చిదిద్దే ప్రక్రియ/ 4, పార్టీ మరియు వివిధ ప్రభుత్వ శాఖల కమిటీలకు ఒక్కొక్కటిగా ప్రణాళికాబద్ధంగా కార్యరూపం/ 5, పార్టీ నిర్మాణంలో/విజయంలో క్షేత్రస్థాయిలో అంకితభావంతో పనిచేసిన వారిని గుర్తించి పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించే ప్రక్రియ/ 6, రాజానగరం నియోజకవర్గంలో పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే విధంగా గ్రామాల్లో కమిటీల నిర్మాణం/ 6, మునుపెన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో పెద్ద ఎత్తున జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ సేవా కార్యక్రమాలు ప్రజలకు తెలిసేలా ప్రచార కార్యక్రమాలు/ 7, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాల కార్యచరణ 8, త్వరలో నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టబోతున్న అనేక అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాల వివరాల వెల్లడి వంటి తదితర అనేక అంశాలపై కూలంకుషంగా శ్రేణులకు వివరణ ఎమ్మెల్యే బలరామకృష్ణ దశా దిశా నిర్దేశం చేయనున్నారు. జనసేన పార్టీ నిర్మాణం/విజయంలో కష్టపడిన జన సైనికులకు, వీర మహిళలకు, నాయకులకు మరింత గుర్తింపు లభించాలని మరియు రాజానగరం నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని సంకల్పంతో తలపెట్టిన ఈ జనసేన పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి నియోజకవర్గ నలుమూలల నుండి జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, పవన్ కళ్యాణ్ అభిమానులు, పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

## ఆంధ్రప్రదేశ్ ఆర్టిసి బస్సులపై మహిళల్లో ఆగ్రహావేశాలు



నేటి శుభోదయ 6 జూన్ ( విజయవాడ). కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు ఎంతగానో ఎదురుచూసిన పథకం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కలగజేయడం ఈ పథకం ప్రారంభించినప్పుడు మహిళల్లో సంతోషాలు వెల్లి విరిసాయి. కానీ మహిళలకు ఆ సంతోషం ఎక్కువకాలం నిలవలేదు కారణమేమిటంటే ఆర్టీసీ అధికారులు ఉచిత బస్సులు సంఖ్య సగానికి పైనే తగ్గించి వేశారు దాంతో మహిళలు ప్రయాణం నరకంగా కనబడుతుంది మరి ఇది ప్రభుత్వానికి తెలిసి చేశారా తెలియక జేశారా అనేది మన అలోచించాల్సిన విషయం. కావాలని ప్రజల్లో వ్యతిరేక రావటానికి ఈ మార్గాన్ని కొంతమంది ఆర్టీసీ అధికారులు ఎంచుకున్నారని ప్రజలు చెప్పుకుంటున్నారు ఎందుకంటే బస్సు సర్వీసులు లేవు పైగా ఉన్న సర్వీసులకి అధిక సంఖ్యలో మహిళలు పోటీ పడటం దాంతో మగవాళ్ళు బస్సులు ఎక్కే పరిస్థితులు లేకపోవటం మరియు కండక్టర్లు డ్రైవర్లు మహిళల మీద చాలా దురుసు ప్రవర్తన ప్రదర్శించడం ఏదో వాళ్ల ఊరికినే వీళ్ళని తీసుకువెళుతున్నట్టు కండక్టర్లు డ్రైవర్లు ఫీలవుతున్నారు. కానీ జీరో టికెట్టు వసూలు చేసే డబ్బులు మొత్తం గవర్నమెంట్ నుంచి ఆర్టీసీ అధికారులు పొందుతున్నారు కానీ వీళ్ళే మహిళలని ఉచితంగా తీసుకెళ్లినట్టు బిల్డప్ ఇస్తున్నారు అంతేకాకుండా ఏ స్టేజిలోనూ బస్సు సరైన చోట ఆపట్లేదు ఇదివరకు చంద్రబాబు నాయుడు గవర్నమెంట్లో చేయి ఎత్తిన చోట బస్సు ఆపబడును అని బోర్డు రాసేవాళ్ళు . కానీ ఇప్పుడు వాళు కొన్ని స్టేజీలు నిర్ణయించుకున్నారు అది ఎవరి నిర్ణయించారో తెలియదు ఆ స్టేజిలోనే బస్సులు ఆపుతున్నారు . పల్లెల్లో ఈ పరిస్థితి మహాదారుణంగా ఉంది బస్టాండ్ లో తప్ప ఇంకెక్కడ బస్సు ఆపట్లేదు బస్టాండ్లో దిగి ఇళ్ల కి వెళ్లడానికి మహిళలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు . ఇది అన్ని ఆర్టీసీ డిపోలో జరుగుతుంది దీని మీద ప్రభుత్వం వెంటనే స్పందించి మహిళలకు మెరుగైన రవాణా సౌకర్యం కలగజేయాలని లేకపోతే ఉన్న ఉచిత బస్సు సౌకర్యం ఉచిత ప్రయాణం ఎత్తివేసి మళ్లీ టిక్కెట్టు బస్సులు నడపాలని మహిళలు కోరుకుంటున్నారు. ముఖ్యంగా మేము గమనించిన ఒక విషయం విజయవాడ నుండి గుంటూరు కి ఆర్డినరీ బస్సులు లేకపోవడం ఇది చాలా విచిత్రమైన విషయం విజయవాడ నుంచి గుంటూరు కి ఒక ఆర్డినరీ బస్సు కూడా లేదంటే ఎవరు నమ్మలేరు కానీ అది నిజం గుంటూరు డిపో గానీ మంగళగిరి డిపో గానీ బస్సులు విజయవాడకి నడిపితేనే గుంటూరు ప్రయాణికులు ఎక్కవలసిన పరిస్థితి విజయవాడ డిపో నుంచి ఒక బస్సు కూడా గుంటూరు కి గాని మంగళగిరి కి గాని లేదు రాత్రి 8 దాటితే చిన్న చిన్న షాపుల్లో పనిచేసుకునే మహిళలు ఎంతో ఇబ్బంది పడుతున్నారు ఈ పరిస్థితిని ఆర్టీసీ అధికారులను అడిగితే ఎవరూ సరైన సమాధానం ఇవ్వట్లేదు . కావున విజయవాడ డిపో నుంచి గుంటూరు కి కూడా ఆర్డినరీ బస్సులు నడపాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## రాయలచెరువు రైల్వే స్టేషన్లో ఎక్స్ప్రెస్ రైళ్ల నిలుపుదలకై యాడికిలో భారీ బహిరంగ సభ



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు



యాడికి జూన్ 06 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక: మండలంలోని రాయలచెరువు రైల్వే స్టేషన్లో గతంలో ఆగుతూ ఉండిన ప్రముఖ రైళ్లను పునరుద్ధరించాలని, ప్రయాణికుల సౌకర్యార్థం తక్షణమే స్టాపింగ్ పాయింట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ యాడికి గ్రామంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో స్థానిక ప్రజలు, వివిధ సంఘాల నాయకులతో భారీ బహిరంగ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాల ప్రజలు, ప్రయాణికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య వక్తలందరూ రైల్వే అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలచెరువు రైల్వే స్టేషన్ ఎంతో పురాతనమైనదని, ఈ ప్రాంత ప్రజల రవాణా అవసరాలకు ఇది ఎంతో కీలకమైన కేంద్రమని గుర్తుచేశారు. కరోనా మహమ్మారి రాకకంటే ముందు ఇక్కడ ధర్మవరం-మచిలీపట్నం ఎక్స్ప్రెస్, చెన్నై ఎగ్మోర్ ఎక్స్ప్రెస్ మరియు తిరుమల ఎక్స్ప్రెస్ వంటి ముఖ్యమైన రైళ్లు క్రమం తప్పకుండా ఆగేవని, దీనివల్ల వేలాది మంది ప్రయాణికులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకునేవారని తెలిపారు. అయితే, కోవిడ్ సంక్షోభాన్ని సాకుగా చూపిస్తూ అప్పట్లో రైల్వే శాఖ ఈ స్టేషన్లో రైళ్ల నిలుపుదలను రద్దు చేసిందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా అన్ని రకాల రవాణా వ్యవస్థలు సాధారణ స్థితికి వచ్చి ఏళ్లు గడుస్తున్నా, రాయలచెరువు స్టేషన్లో రైళ్ల స్టాపింగ్ను పునరుద్ధరించకపోవడం వెనుక అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ధ్వజమెత్తారు. అధికారులు ఇప్పటివరకు దీనిపై ఎలాంటి పునరాలోచన చేయకుండా కాలయాపన చేస్తూ ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైళ్ల నిలుపుదల లేకపోవడం వల్ల ఈ ప్రాంత ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లాలంటే తీవ్ర ఆర్థిక భారంతో పాటు మానసిక క్షోభను అనుభవిస్తున్నారని వక్తలు పేర్కొన్నారు. మన ప్రాంత హక్కులను సాధించుకోవడానికి, రాయల చెరువు రైల్వే స్టేషన్ పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకురావడానికి అందరం పార్టీలకు, కులమతాలకు అతీతంగా కలిసికట్టుగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. అవసరమైతే ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు, రైల్వే బోర్డుపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీ వరకైనా వెళ్లి ప్రత్యక్ష పోరాటాలు, ధర్నాలు చేయడానికి తామంతా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రైల్వే ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి రాయలచెరువు స్టేషన్లో ధర్మవరం-మచిలీపట్నం, ఎగ్మోర్, తిరుమల ఎక్స్ప్రెస్ రైళ్లకు తక్షణమే స్టాపింగ్ పాయింట్లను మంజూరు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మహాసభలో అమిలినేని కులశేఖర్, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, తెలుగుదేశం మండల కన్వీనర్ దడియాల ఆదినారాయణ, మామిళ్ళ నారాయణస్వామి, నీలూరు లక్ష్మయ్య, బండారు బాలకృష్ణ, వద్ది రాజశేఖర్, విజన్ విశ్వనాథ్, రవికుమార్ రెడ్డి, దాసరి విశ్వనాథ్, పప్పు నరేష్, దాసరి పురుషోత్తం, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు, పౌర సమాజ ప్రతినిధులు మరియు యాడికి గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని తమ మద్దతును ప్రకటించారు...

## 'త్వరలో జరగనున్న స్థానిక సంస్థలతో పాటుగా.. 2029 అసెంబ్లీ ఎన్నికలలోనూ ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో ప్రభంజనం సృష్టించడం ఖాయం..!'

– రాజానగరం నియోజకవర్గ టిడిపి యువ నేత పెందుర్తి అభిరామ్..

కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతున్నారని, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ సారధ్యంలో ప్రభుత్వం అత్యద్భుతంగా సుపరిపాలన అందిస్తోందని తెలుగుదేశం పార్టీ రాజానగరం నియోజకవర్గ యువ నేత పెందుర్తి అభిరామ్ సంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ఆయన కోరుకొండలో మీడియాతో మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న స్థానిక సంస్థలతో పాటుగా.. 2029 అసెంబ్లీ ఎన్నికలలోనూ ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో మళ్ళీ ప్రభంజనం సృష్టించడం ఖాయం అని ధీమా వ్యక్తంచేశారు. గత ప్రభుత్వ పాలనలోని విధ్వంసకరమైన వాతావరణశీ, అరాచక పాలనను ప్రజలు ఇప్పుడిప్పుడే మరిచి ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్నారన్నారు. ఈ దశలో ప్రజలను మభ్య పెట్టాలని వైసిపి నాయకులు చేస్తున్న బూటకపు ఉద్యమాలకు అర్థం లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను చక్కగా అమలు చేస్తూ.. ప్రజాభిమానాన్ని మరింతగా చురగొంటుందన్నారు. రాజానగరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే



బత్తుల బలరామకృష్ణ సారధ్యంలో సి.సి. రోడ్లు, బి.టి.రోడ్లు, డ్రైన్లు, కమ్యూనిటీ భవనాలు శరవేగంగా నిర్మాణం జరిగాయని, అలాగే అభివృద్ధి, సంక్షేమాలను పరుగులు పెట్టిస్తూ ప్రజల అందరి మన్ననలను ఎమ్మెల్యే బలరామకృష్ణ కైవసం చేసుకోవడం హర్షనీయమని అభిరామ్ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని, 'పెందుర్తి సేవా ట్రస్ట్' సారధ్యంలో రానున్న పుష్కరాలలోనూ పలు రకాల సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అభిరామ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెందుర్తి అభిమానులు పాల్గొన్నారు.

# పడకేసిన ప్రత్యేక పాలన... కార్యాలయంలో సిబ్బంది జాడే లేదు!



పులిచెర్ల, జూన్ 6,(నేటి శుభోదయ) :చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లి స్వర్ణ గ్రామ కార్యాలయంలో అధికారుల గైర్హాజరు ప్రజలను తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అవసరాల కోసం కార్యాలయానికి వచ్చిన ప్రజలకు సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడంతో పలువురు నిరాశతో వెనుదిరుగుతున్నారు. అధికారులు లేకపోయినా కార్యాలయం తలుపులు తెరిచి ఉండటం, ఫ్యాన్లు తిరుగుతుండటం, కార్యాలయంలోని వస్తువులు నిర్లక్ష్యంగా వదిలేయడం భద్రతా పరమైన ప్రశ్నలకు తావిస్తోంది. ప్రజలకు సేవలు అందించాల్సిన కార్యాలయంలో సిబ్బంది ఎప్పుడు విధులకు హాజరవుతున్నారు, ఎప్పుడు వెళ్తున్నారు అన్నదానిపై స్పష్టత లేకపోవడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రత్యేక పాలన పేరుతో ప్రభుత్వ యంత్రాంగం నడుస్తున్నప్పటికీ గ్రామ స్థాయిలో సేవలు మాత్రం కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు. స్వర్ణ గ్రామ కార్యాలయంలో నెలకొన్న పరిస్థితులపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, విచారణ జరిపి ప్రజలకు సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- సంక్షేమ హాస్టల్స్ సమస్యలపై టీఎన్జీవోస్ వినతిపత్రం



ఖమ్మం, నేటి శుభోదయ ::: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, సౌకర్యాల కల్పన విషయంలో అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ దివాకర టిఎస్ సూచించారు. తెలంగాణ నాన్-గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆ శాఖ జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు నాయకత్వంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ని కలిసి సంక్షేమ హాస్టళ్లకు సంబంధించిన పలు సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వినతిపత్రంలోని అంశాలను శ్రద్ధగా విన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించాలని, హాస్టళ్లలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. అలాగే, విద్యార్థులతో ఎలాంటి పనులు చేయించరాదని, హాస్టళ్లలో ఫుడ్ పాయిజనింగ్ వంటి ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. టీఎన్జీవోస్ ప్రతినిధులు 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి హాస్టళ్లలో మరమ్మతులు, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ మరియు ప్లంబింగ్ సిబ్బంది ఏర్పాటు, నిత్యావసర సరుకుల సరఫరా, కామన్ మెనూ అమలు, సపోర్ట్ స్టాఫ్ నియామకం, కళాశాల హాస్టల్ వాచ్‌మెన్‌ల పెండింగ్ వేతనాల విడుదల, విద్యార్థులకు వైద్య సేవల విస్తరణ, సివిల్ సప్లైస్ బియ్యం మరియు ఉచిత వస్తువులను నేరుగా హాస్టల్ పాయింట్లకు చేర్చడం తదితర అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.



వినతిపత్రంలోని అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి, సాధ్యమైనంత త్వరగా తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం, హాస్టల్ పరిపాలన బలోపేతం కోసం తాము కూడా పూర్తి బాధ్యతతో పనిచేస్తూ విద్యార్థుల శ్రేయస్సుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి కొనిదెన శ్రీనివాస్, కోశాధికారి వల్లపు వెంకన్న, హాస్టల్ వెల్ఫేర్ ఫోరం జిల్లా అధ్యక్షులు కోటపాటి రుక్మారావు, జిల్లా కార్యదర్శి యన్. నాగేశ్వరరావు, జిల్లాలోని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# సమాజంలో ప్రతి వర్గాన్ని నాశనం చేస్తోన్న మోడీ ప్రభుత్వం



న్యూఢిల్లీ : సమాజంలో ప్రతి వర్గాన్ని మోడీ ప్రభుత్వం నాశనం చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం తీవ్రంగా ఆరోపించారు. ప్రస్తుత జాతీయ వ్యవహారాల స్థితిపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాల దీర్ఘకాలిక దృక్పథాన్ని, సమాజంలోని వివిధ వర్గాలపై వాటి ప్రభావాన్ని ఖర్గే ప్రశ్నించారు. కాగా, 'మీరు ఎలాంటి భారతదేశాన్ని కావాలనుకుంటున్నారో నేను తెలుసుకోవాలనుకుంటున్నాను. మీరు సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం వంటి సూత్రాలను విస్మరించడం స్పష్టంగా కనిపిస్తుంది. పన్ను చెల్లింపుదారుల డబ్బుతో వివిధ పథకాలను ప్రారంభించి, ఆ పథకాల ప్రచారంతో ప్రజలను కొద్దిగా మోసం చేయవచ్చు. కానీ మీరు మహిళలు, రైతులు, పేదలు, దళితులు, ఆదివాసులు, వంచితులు, విద్యార్థుల హక్కులను దెబ్బతీసి, వారిని ఆగ్రహానికి గురిచేశారు' అని ఖర్గే గతంలో రాజ్యసభలో మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వీడియోను తాజాగా శనివారం కాంగ్రెస్ పార్టీ ఎక్స్‌లో పోస్టు చేసింది.

# పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. ప్రధాని మోదీ కీలక భేటీ

ఢిల్లీ: పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఆర్థిక సలహా మండలితో ప్రధాని నరేంద్ర మోదీ సమావేశం నిర్వహించారు. భారత్‌పై యుద్ధ ప్రభావం తగ్గించే చర్యలపై కసరత్తు, ప్రపంచవ్యాప్త అస్థిరతల మధ్య భారతదేశ ఆర్థిక వృద్ధిని మరింత పెంపొందించడానికి వివిధ ఆలోచనలు, చర్యలపై చర్చలు జరిపారు. ఆర్థికవృద్ధిని బలోపేతం చేయడంతో పాటు అంతర్జాతీయంగా వచ్చే ఒడుదొడుకులను తట్టుకునే సామర్థం పెంపుదల, వాణిజ్యానికి మరింత అనుకూల వాతావరణాన్ని కల్పించేలా సంస్కరణలను వేగవంతం చేయడం వంటి అంశాలపై చర్చించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ప్రపంచ ఆర్థిక ఒడిదుడుకుల సమయంలో భారత్ ఆర్థిక వృద్ధిని మరింతగా ఎలా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై వివిధ వ్యూహాలను, చర్యలను చర్చించారని వారు పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ ప్రమాదకర స్థాయికి చేరుకున్న సంగతి తెలిసిందే. హర్ముజ్ జలసంధిలో అమెరికా దళాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ డ్రోన్ల దాడికి దిగింది. అయితే వాటిని తిప్పి కొట్టడంతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. అంతటితో ఆగకుండా ఇరాన్‌కు చెందిన తీర ప్రాంత రాడార్ కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులు నిర్వహించింది. ఇప్పటికే సున్నితంగా మారిన గల్ఫ్ ప్రాంతంలో తాజా పరిణామాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. హర్ముజ్ జలసంధి వద్ద ప్రారంభమైన ఈ తాజా ప్రతిష్టంభన ఎటు దారి తీస్తుందనేది ఇప్పుడు ప్రపంచ దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ప్రపంచ చమురు ధరలు, అంతర్జాతీయ వాణిజ్యం, పశ్చిమాసియా భద్రతా పరిస్థితులపై కూడా ఈ ప్రభావం పడే అవకాశం ఉంది.

# అమెరికాలో అక్రమ వలసదారులు.. భారత్ కీలక ప్రకటన

ఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపారు. ఎట్టి పరిస్థితుల్లో వారు దేశంలోకి ఉండనిచ్చేది లేదంటూ ఎన్నో కఠిన నిబంధనలు తీసుకవచ్చి వారిని దేశం నుంచి బహిష్కరించారు. ఈ నేపథ్యంలోనేఅమెరికా నుంచి దేశ బహిష్కరణకు గురైన వారి వివరాలు భారత్ ప్రకటించింది. భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ అమెరికా నుంచి దేశ బహిష్కరణకు గురైన వారి వివరాలు ప్రకటించారు. "2026లో ఇప్పటివరకూ 1,076 మంది బహిష్కరణకు గురయ్యారు. అదే గతేడాది మట్టుత్తంగా 3,567 మంది బహిష్కరణకు గురయ్యారు. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్య తక్కువగా ఉంది. అయినప్పటికీ ఇది అధికమే" అని జైశ్వాల్ అన్నారు. దేశ బహిష్కరణకు గురైన వారిలో సరైన పత్రాలు లేకపోవడంతో పాటు వీసా ఉల్లంఘనలకు పాల్పడిన వారు ఉన్నారని పేర్కొన్నారు. అక్రమ వలసల విషయమై భారత్, అమెరికా దేశాలు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయని అక్రమ వలసలను ఎలా అరికట్టాలి, అదే సమయంలో ఇది చట్టబద్ధమైన వలసలపై ప్రతికూల ప్రభావం చూపకుండా ఎలా చూసుకోవాలి అనే దానిపై ఇరుదేశాలు దృష్టి సారించాయనిపేర్కొన్నారు. కాగా ఈ వారంలోనే భారత్‌కు చెందిన సుమారు 30 మంది వ్యక్తులు వాణిజ్య ట్రక్కు డ్రైవర్లుగా పనిచేస్తూ అమెరికాలో చట్టవిరుద్ధంగా నివసిస్తున్నట్లు గుర్తించారు . వీరిని త్వరలోనే దేశ బహిష్కరణకు గురిచేసే అవకాశం ఉంది.

# నేడే 'వికాస్ ఫార్మసీ కళాశాల' చైర్మన్ తన్నీరు చిన సుబ్బారావు పెద్దకార్యం..!!

- వికాస్ డైరెక్టర్ డా.టి.వి.నారాయణను కలిసి సంతాపాన్ని వ్యక్తం చేసిన వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు..!!




కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); వికాస్ ఫార్మసీ కళాశాల చైర్మన్ తన్నీరు చిన సుబ్బారావు (85) పెద్దకార్యం 7 వ, తేదీ ఆదివారం ఉదయం విమానాశ్రయం వద్ద ఉన్న తమ వికాస్ ఫార్మసీ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నారు. ఇప్పటికే స్వర్గీయ సుబ్బారావు మృతికి వికాస్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అలాగే జిల్లా నలుమూలల నుండి శ్రేయభిలాషులు, మిత్రులు వచ్చి డాక్టర్ టివి నారాయణను, వారి కుటుంబ సభ్యులను కలుసుకుని ఓదార్చారు. స్వర్గీయ సుబ్బారావుకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె గలరు. పెద్ద కుమారుడు డా.టీ వీ నారాయణ కళాశాల డైరెక్టర్, సత్య శ్రీనివాస్ రిటైర్డ్ బిఎస్ఎన్ ఎల్ ఆఫీసర్, నగేష్ కుమార్, జ్యుడిషియల్ డిపార్ట్మెంట్, కుమార్తె పద్మావతి వున్నారు. కాగా సుబ్బారావు ఆత్మకు భగవంతుడు శాంతిని చేకూర్చాలని బంధు మిత్రులు, శ్రేయభిలాషులు కోరారు. ఆదివారం జరగనున్న కార్యక్రమానికి అయన శిష్యులు, వివిధ రంగాల ప్రముఖులు, హాజరుకానున్నారు.



# అందరూ ప్రేమకథే చూశారు.. అసలు కథ వేరే ఉంది!



భారత సైన్యానికి చెందిన కెప్టెన్ భరత్ భరద్వాజ్ తన కాబోయే భార్య ఆరోషికి యూనిఫామ్‌లో.. అదీ ఆర్మీ హెలికాప్టర్‌లో ప్రపోజ్ చేసిన వీడియో ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. విధుల్లో ఉండగా ఇవేం పనులంటూ ఆర్మీ అధికారులతో సహా కొందరు దీనిని ఖండించారు. మాజీల్లో కొందరు మాత్రం 'ఈ వయసులో కాకపోతే ఇంకెప్పుడు చేస్తారు?' భరద్వాజ్‌కు సపోర్ట్ చేశారు. అయితే ఆ రొమాంటిక్ దృశ్యం వెనుక.. అత్యంత కీలకమైన ఓ అంశాన్ని మాత్రం ఎవరూ పట్టించుకోకపోవడం ఇప్పుడు ఆసక్తికర చర్చకు దారి తీసింది. కెప్టెన్ భరత్ భరద్వాజ్ భారత సైన్యంలో యంగ్ ఆర్మీ ఏవియేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న అధికారి. ఇటీవలే హెలికాప్టర్ పైలట్‌గా శిక్షణ పూర్తి చేసి యూనిఫామ్‌లో ఫ్రంట్‌లైన్ సర్వీస్‌కు సిద్ధమయ్యాడు. అతని కాబోయే భార్య ఆరోషి, సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన యువతి. ఇద్దరూ గత కొంతకాలంగా ప్రేమలో ఉండగా, అధికారిక శిక్షణ పూర్తి అయిన సందర్భంలో భరద్వాజ్ చేసిన ఈ ప్రత్యేక ప్రపోజల్ క్షణాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. యువ వయసులో ఉన్న ఈ జంటకు సంబంధించిన ఈ రొమాంటిక్ ఘటన ఒకవైపు చర్చనీయాంశంగా మారితే, మరోవైపు యూనిఫామ్‌లో వ్యక్తిగత జీవితం ఎంతవరకు సమంజసం అన్న డిబేట్‌కు కూడా దారితీసింది. భరద్వాజ్ ప్రపోజల్ కోసం ఉపయోగించిన హెలికాప్టర్ 'చీతా'. గత 50 ఏళ్లుగా భారత సైన్యం దాని మీదే ఆధారపడి ఉంటోంది. ఫ్రాన్స్‌కు చెందిన ఏరోస్పటియల్ సంస్థ డిజైన్ చేసిన ఈ హెలికాప్టర్‌ను హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (నూూా) 1970ల నుంచి భారత్‌లో తయారు చేస్తోంది. సియాచిన్ వంటి అత్యంత ఎత్తైన, క్లిష్టమైన ప్రాంతాల్లో సైనిక రవాణా, గాయపడిన వారిని తరలించడం, సరఫరాలు అందించడం వంటి కీలక బాధ్యతలను ఇది నిర్వర్తిస్తోంది. కానీ దీని భద్రతపై చాలా కాలంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. 1974 నుంచి 2022 మధ్య కాలంలో చీతా హెలికాప్టర్లు 60కి పైగా ప్రమాదాలకు గురయ్యాయి. ఈ ఘటనల్లో పలువురు పైలట్లు ప్రాణాలు కోల్పోయారు. మొన్న.. మే 20న లడఖ్‌లోని టాంగ్‌స్టే ప్రాంతంలో మరో చీతా హెలికాప్టర్ కుప్పకూలింది. ఇందులో ఉన్న ముగ్గురు సైనిక అధికారులు ప్రాణాపాయం నుంచి బయటపడినా.. ఇప్పుడు ఈ ప్రేమకథ పుణ్యమాని ప్రమాదాల పరంపరను మరోసారి కొందరు చర్చకు తీసుకొచ్చారు.

### రీల్ కాదు రియల్..! ఆర్మీ ఆఫీసర్ ప్రపోజ్ కి ఫిదా

అలాగని చీతా మాత్రమే కాదు, దాని సోదర మోడల్ 'చేతక్' హెలికాప్టర్ కూడా ప్రమాదాల పరంగా చెడు రికార్డే కలిగి ఉంది. ఆర్మీ వైవ్స్ అజిటేషన్ గ్రూప్ వివరాల ప్రకారం, గత కొన్ని దశాబ్దాల్లో చీతా-చేతక్ హెలికాప్టర్లకు సంబంధించిన దాదాపు 191 ప్రమాదాల్లో 294 మంది పైలట్లు మరణించారు. ఈ కారణంగానే వీటిని కొందరు "ఫ్లయింగ్ కాఫిన్స్" (ఎగిరే శవపేటికలు)గా కూడా అభివర్ణించారు. వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనే ఆధునిక సాంకేతికత, నావిగేషన్ వ్యవస్థలు లేకపోవడం వల్లే అనేక ప్రమాదాలు జరిగాయని మాజీ వైమానిక దళ అధికారి ఎయిర్ మార్షల్ జీఎస్ బేడీ అభిప్రాయపడ్డారు. దీంతో 2027 నుంచి చీతా, చేతక్ హెలికాప్టర్లను దశలవారీగా సేవల నుంచి తప్పించాలని సైన్యం, వైమానిక దళం నిర్ణయించాయి. వాటి స్థానంలో స్వదేశీంగా అభివృద్ధి చేసిన నూూా లైట్ యుటిలిటీ హెలికాప్టర్ (ఞఖఎ)ను తీసుకురావాలని ప్రణాళిక రూపొందించినా, సర్టిఫికేషన్ వివాదాలు, సాంకేతిక అడ్డంకుల కారణంగా ఆ ప్రాజెక్టు ప్రస్తుతం నిలిచిపోయినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఒకవైపు వైరల్ ప్రపోజల్ దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైతే.. మరోవైపు అదే హెలికాప్టర్‌లో ఎన్నో ప్రాణాలు కోల్పోయిన సైనిక కుటుంబాలు మాత్రం ఆధునిక ప్రత్యామ్నాయాల కోసం ఇంకా ఎదురుచూస్తున్నాయి. సియాచిన్ నుంచి లడఖ్ వరకు ఎన్నో విజయవంతమైన మిషన్లకు చీతా సాక్ష్యమైనా, దాని వయసు మీద పడడం, ప్రమాదాల చరిత్ర ఇప్పుడు భారత సైన్యానికి పెద్ద సవాలుగా మారింది.

# జిల్లాలోని ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి ప్రత్యేక రక్షణ కిట్లు పంపిణీ చేసిన జిల్లా ఎస్పీ

ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రదాన్యతనిస్తున్నాం



బాపట్ల నేటి శుభోదయ(రవి కిరణ్) జూన్ 6: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ట్రాఫిక్ సిబ్బంది కీలకం.. గత సంవత్సరంతో పోలిస్తే 20 శాతం తగ్గింపే లక్ష్యం విధులు నిర్వహించాలి రోడ్డు ప్రమాదం వల్ల సంభవించే ఒక్క మరణం ఆ వ్యక్తితో ముగిసిపోదు, ఆ కుటుంబాన్ని చిన్నబిన్నాం చేస్తుంది "శిరోరక్ష -- ప్రాణరక్ష" కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ ధారణ పై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలి పోలీసులు ఉన్నారు, చలానాలు విధిస్తారు అనే భయంతో కాకుండా, తమ భద్రత కోసం స్వచ్ఛందంగా హెల్మెట్ దరించే విధంగా ప్రజలలో చైతన్యం తీసుకురావాలి

జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ .

ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రదాన్యతనిస్తున్నామని, గత సంవత్సరంతో పోలిస్తే 20 శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గింపే లక్ష్యం ప్రతిఒక్కరు సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ శ్రీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ ఆదేశించారు. ఎటువంటి క్లిష్ట పరిస్థితులలోనైనా రోడ్లపై నిరంతరం ట్రాఫిక్ విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందిస్తున్న పోలీస్ సిబ్బంది ఆరోగ్యం, భద్రతపై ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు శనివారం క్యాంపు కార్యాలయంలో ట్రాఫిక్ సిబ్బందికి ప్రత్యేక రక్షణ కిట్లను పంపిణీ చేశారు. ఈ కిట్‌లో ఎండ తీవ్రత నుంచి రక్షణ పొందేందుకు ప్రత్యేక టోపీ, కళ్లకు కూలింగ్ గ్లాసెస్, ధూళి నుంచి రక్షణకు మాస్కులు, డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండేందుకు ా=ా ప్యాకెట్లను ఎస్పీ గారు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి ఎండ నుంచి రక్షణ కల్పించే రౌండ్ హ్యాట్, సూర్యరశ్మి, దుమ్ము, ధూళి వల్ల కళ్లకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు డే అండ్ నైట్ కూలింగ్ గ్లాసెస్, కాలుష్యం నుంచి రక్షణకు మాస్కులు, అలాగే నిరంతరం నిలబడి విధులు నిర్వహించడం వల్ల నీరసం రాకుండా తక్షణ శక్తినిచ్చే ా=ా ప్యాకెట్లను అందించడం జరిగిందన్నారు. సామాన్య ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికే భయపడుతున్న పరిస్థితుల్లో కూడా ట్రాఫిక్ సిబ్బంది ఎండను, ధూళిని లెక్కచేయకుండా విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఈ కిట్ ట్రాఫిక్ సిబ్బందికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల సంభవించే మరణాలను తగ్గించాలనే ఉద్దేశంతో ఏప్రిల్ 1వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా "శిరోరక్ష -- ప్రాణరక్ష" కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించేలా ప్రజలకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావడమే ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతిరోజూ విధుల్లో ఉండే ట్రాఫిక్ సిబ్బంది ఈ కార్యక్రమం ఉద్దేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పోలీసులు ఉన్నారు, చలానాలు విధిస్తారు అనే భయంతో కాకుండా, తమ భద్రత కోసం స్వచ్ఛందంగా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలపై ప్రయాణించాలనే భావన ప్రజల్లో పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో అధిక శాతం మంది ద్విచక్ర వాహనదారులేనన్నారు. దీనికి ప్రధాన కారణం ప్రయాణ సమయంలో వారు హెల్మెట్ ధరించకపోవడమేనన్నారు. ప్రజలకు హెల్మెట్ ధారణపై విస్తృత అవగాహన కల్పించి, ప్రతి ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే మరణాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. ప్రాణం ఎంతో విలువైనదని, చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల ప్రజలు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రజలు రోడ్డు భద్రతా నియమాలు పాటించేలా అవగాహన కల్పిస్తూ, సమర్థవంతంగా విధులు నిర్వహించి గత సంవత్సరంతో పోలిస్తే 20 శాతం రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే లక్ష్యంతో పనిచేయాలన్నారు. 20 శాతం వరకు రోడ్డు ప్రమాదాలను తగ్గించగలిగితే ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపిన వారమవుతామన్నారు. రోడ్డు ప్రమాదం వల్ల సంభవించే ఒక్క మరణం ఒక వ్యక్తితో ముగిసిపోదని, ఆ కుటుంబమంతటినీ తీవ్ర విషాదంలోకి నెట్టివేస్తుందన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తామన్నారు. ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే ప్రతి శుక్రవారం నిర్వహించే "ఎస్పీ సంపర్క్" కార్యక్రమంలో సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్య ఫోన్ ద్వారా నేరుగా సంప్రదించవచ్చన్నారు. అదేవిధంగా ప్రతి రెండో శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి వచ్చి నేరుగా కలిసి సమస్యలను వివరించవచ్చని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ సీహెచ్. చంద్రమౌళి, ఎస్‌బీ-2 ఇన్‌స్పెక్టర్ ఎం. రాంబాబు, బాపట్ల టౌన్ ఇన్స్పెక్టర్ ఆర్. రాంబాబు, ఎస్.సి, ఎస్.టి సెల్ ఇన్స్పెక్టర్ బాలనాగిరెడ్డి, అడ్మిన్ ఆర్ఐ షేక్.మౌలుద్దీన్ తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## విజయదుర్గ పీఠాధిపతి మృతి పట్ల వైఎస్ జగన్ దిగ్భ్రాంతి



తాడేపల్లి: విజయదుర్గ పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం మృతిపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. “పీఠాధిపతి మృతి ఆధ్యాత్మిక రంగానికి తీరని లోటు. ఆధ్యాత్మిక రంగానికి విశిష్ట సేవలందిస్తూ వేలాది మంది భక్తులకు మార్గదర్శకులుగా నిలిచారు. ధర్మ పరిరక్షణ, సనాతన ఆధ్యాత్మిక విలువల ప్రచారం.. భక్తి మార్గ బోధన కోసం ఆయన జీవితాంతం అంకితభావంతో కృషి చేశారు” అని వైఎస్ జగన్ అన్నారు. “సుబ్రహ్మణ్యం గారి సేవలు, బోధనలు భక్తుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. ఆయన మరణం భక్తజనులకు తీవ్ర వేదన కలిగించింది. సుబ్రహ్మణ్యం గారి కుటుంబ సభ్యులకు, శిష్యులకు, భక్తులకు నా ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నా. సుబ్రహ్మణ్యం గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా” అని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

# ఎపి కి చల్లటి కబురు ..!



అమరావతి : గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వాతావరణ శాఖ అత్యంత చల్లటి కబురు అందించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించాయి. రాష్ట్రంలోని అనంతపురం, సత్యసాయి, చిత్తూరు జిల్లాలను రుతుపవనాలు తాకినట్లు భారత వాతావరణ శాఖ అధికారికంగా వెల్లడించింది. రాబోయే రోజుల్లో రుతుపవనాలు వేగంగా ముందుకు కదలనున్నాయి. ఈ నెల 10వ తేదీ నాటికి ఎపిలోని సగానికి పైగా భూభాగానికి రుతుపవనాలు విస్తరించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. దీని ప్రభావంతో రాగల రెండు, మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తొలకరి జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. సాధారణంగా జూన్ 1వ తేదీ నాటికే కేరళలోకి ప్రవేశించాల్సిన నైరుతి రుతుపవనాలు, ఈసారి మూడు రోజులు ఆలస్యంగా గురువారం కేరళను తాకాయి. అయినప్పటికీ, ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబరు వరకు సాగే రుతుపవనాల సీజన్‌లో దేశంలో 90 శాతం మేర సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి స్పష్టం చేసింది. రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించినప్పటికీ.. ఉక్కపోత, ఎండల తీవ్రత వెంటనే తగ్గే పరిస్థితి లేదని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా దక్షిణ కోస్తా ప్రాంతంలో వేడిగాలుల ప్రభావం మరికొద్ది రోజుల పాటు కొనసాగుతుందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తొలకరి జల్లులు కురిసి, రుతుపవనాలు పూర్తిగా విస్తరిస్తేనే ఉష్ణోగ్రతలు అదుపులోకి వస్తాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

## కాపీ కొట్టిన పథకానికి పాస్ మార్కులు రాలేదు: మాజీ మంత్రి



కాకినాడ: కూటమి ప్రభుత్వం చేతిలో మోసపోయామంటూ నిరుద్యోగులు, రైతులు వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఆశ్రయిస్తున్నారని మాజీ మంత్రి కన్నబాబు అన్నారు. శనివారం కాకినాడలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ప్రజల సమస్యలు తీర్చడంతో ప్రభుత్వం విఫలమవడం వల్లే.. అమరావతి రైతులు మొదలుకుని డీఎస్సీ అభ్యర్థుల వరకు ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్ ముందే గోడు వెళ్లబోసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రజల సమస్యలు పరిష్కరిస్తే తండోపతండాలుగా జగన్ వద్దకు ఎందుకు వస్తారో కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ప్రస్తుతం బీజేపీ, జనసేన కూటమిలో భాగస్వామ్యులైతే కాంగ్రెసేమో వారికి రహస్య మిత్రులని ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వాన్ని నిలదీసే ఏకైక మట్నగాడు వైఎస్ జగన్ అన్నారు. వామపక్షాలు స్పందిస్తున్నా.. ప్రభుత్వాన్ని ఉధృతంగా నిలదీసే శక్తి కేవలం వైయస్ జగన్‌కే ఉంది. మూడు ప్రాంతాల్లో మూడు సభలు పెడతామంటున్న కూటమి నేతలు, ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని గుండెల మీద చేయి వేసుకుని, దేవుడిపై ప్రమాణం చేసి చెప్పగలరా? ఆడబిడ్డ నిధి కింద 18 నుండి 50 ఏళ్ల మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామన్న హామీ ఏమైంది? నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతిని ఇవాళ్టికి ఒక్క నిరుద్యోగికైనా ఇచ్చామని చెప్పగలరా? అని అడిగారు. జగన్ ఇచ్చిన 'అమ్మఒడి'ని కాపీ కొట్టి 'తల్లికి వందనం' అని పేరు మార్చారని అయినప్పటికీ పథకం అమలులో కనీసం పాస్ మార్కులు తెచ్చుకోలేదన్నారు. ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ 'తల్లికి వందనం' ఇస్తామన్న మాటను తుంగలో తొక్కారు. తల్లికి వందనం పథకంలో ఏకంగా 20 లక్షల మంది విద్యార్థులకు కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపింది. రూ.13,112 కోట్ల బడ్జెట్ అవసరమైతే.. కూటమి ప్రభుత్వం కేటాయించింది కేవలం రూ.8,456 కోట్లే అన్నారు. ఆక్వా రైతులను ఆదుకోకుండా.. నిన్న ఎక్స్‌పోలో 'బ్లూ ఎకానమీ' అంటూ బాబు గొప్పలు చెప్తున్నారు. జగన్ హయాంలో ఆక్వా రైతులకు కరెంట్ సబ్సిడీ ఇచ్చి, రొయ్యల మేత ధరలు పెరగకుండా నిలబెట్టాం. కూటమి రాగానే రొయ్యల మేత ధరలు ఎందుకు పెరిగాయి?.. సీజన్ వచ్చేసరికి రొయ్యల ధరలు ఎందుకు పడిపోతున్నాయని మాజీ మంత్రి కన్నబాబు కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు.

## హైడ్రాపై సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్: నగరంలోని విపత్తు నిర్వహణ, ప్రజా ఆస్తుల రక్షణ, పట్టణ నియంత్రణ ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవడానికి ఏర్పాటైన సంస్థే హైడ్రా . అయితే ఇది గత కొంతకాలంగా బాగా ఫేమస్ అయ్యింది. అక్రమ నిర్మాణాల కూల్చివేత ఘటనలకు సంబంధించి హైడ్రా పేరు మార్మోగుతూనే ఉంది. 2024లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ సంస్థను ఏర్పాటు చేశారు. 2024, జూలైలో దీన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సంస్థను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకొచ్చారు. అయితే తాజాగా హైడ్రాపై రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. హైడ్రా అని పేరు పెట్టడానికి గల కారణాలను వెల్లడించారు. నియంతగా పేరుగాంచిన హిట్లరే ఇందుకు కారణమన్నారు సీఎం రేవంత్. హైడ్రా అనే పేరు హిట్లర్‌కు చాలా ఇష్టమని, హిట్లర్‌కు చాలా దగ్గరగా ఉన్న హంతక ముఠా పేరు హైడ్రా అని సీఎం రేవంత్ తెలిపారు. అందుచేత అక్రమ కట్టడాలు చేసే వారు భయపడాలనే ఉద్దేశంతోనే హైడ్రా అని పేరుపెట్టామన్నారు. హైదరాబాద్‌లో చెరువులను ఎవరు ఆక్రమించాలనుకున్నా భయపడాలని ఉద్దేశంతోనే ఈ పేరు పెట్టామన్నారు.

# మయన్మార్‌తో చెలిమి



అనుచిత కారణాలవల్ల తరచు వార్తల్లో ఉండే మయన్మార్ నుంచి ఆ దేశాధ్యక్షుడు మిన్ ఆంగ్ హ్లాయింగ్ అయిదు రోజుల పర్యటన కోసం శనివారం మన దేశం వచ్చారు. ఆయనతోపాటు వచ్చిన బృందంలో కేబినెట్ మంత్రులు, వ్యాపారవేత్తలు ఉన్నారు. కొన్ని దశాబ్దాలక్రితం ఇలాంటి పర్యటన ఊహించలేం. ఎందుకంటే ఆ దేశం నిరంతరం సైన్యం పడగనీడలో మనుగడ సాగిస్తోంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను సైన్యం బతకనీయదు. 2020లో తిరుగులేని మెజారిటీతో వరసగా రెండోసారి ఎన్నికైన ప్రజా స్వామ్య ఉద్యమ నేత ఆంగ్ సాన్ సూకీ నాయకత్వంలోని నేషనల్ లీగ్ ఫర్ డెమాక్రసీ (ఎన్‌ఎల్‌డీ) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, ఏడాదిలోపే సైనిక దళాలు హస్తగతం చేసుకున్నాయి. మన పొరుగును మనం ఎంచుకోలేం. అక్కడ ఎలాంటి ప్రభుత్వాలుండాలో ఆశించటం కూడా అసాధ్యం. మారుతున్న ప్రపంచ పరిణామాల నేపథ్యంలో మన ప్రయోజనాలు తప్ప వేరే దేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లాలని, అందుకోసం అక్కడి పాలకులపై 'నైతిక ఒత్తిడి' తీసుకురావాలనుకోవటం వృథా ప్రయాసగా, అనవసర చాదస్తంగా భావించే ధోరణి అలుముకుంది. మార్క్సిజాన్ని అనుసరిస్తున్నానని చెప్పుకొనే చైనా దశాబ్దాల క్రితమే ఈ సూత్రాన్ని నమ్మి మయన్మార్‌ను అక్కున చేర్చుకుని అన్నివిధాలా లాభపడింది. వాస్తవానికి మయన్మార్‌తో మన దేశానికి సన్నిహిత సంబంధాలుండేవి. 1951లో ఆ దేశంతో స్నేహ ఒప్పందం కుదిరింది. 1955లో మనతోపాటు అలీనోద్యమ అంకు రార్పణకు తోడ్పడిన దేశాల్లో మయన్మార్ ఒకటి. కానీ 1958లో సైనిక పాలకుల ఆగమనం తర్వాత ఆ సంబంధాలు దెబ్బతిన్నాయి. మనమే కాదు... దాదాపు ప్రపంచ దేశాలన్నీ దానితో 'దౌత్యపరమైన అంటరానితనాన్ని' పాటించటం మొదలెట్టాయి. 1988లో ప్రజాస్వామ్య ఉద్యమాన్ని సైనిక పాలకులు అణిచేయటాన్ని నిరసిస్తూ సూకీకి భారత్ మద్దతు ప్రకటించింది. 1992లో జవహర్‌లాల్ నెహ్రూ అంతర్జాతీయ అవగాహన అవార్డుకు ఆమెను ఎంపిక చేసింది. కానీ వాజ్‌పేయి నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం 2002లో మళ్లీ దాంతో సంబంధ బాంధవ్యాలు పునరుద్ధరించి మాండలేలోని భారత కాన్సులేట్‌ను పునఃప్రారంభించింది. తిరిగి మళ్లీ 2014లో నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని ఎన్డీయే అధికారంలోకొచ్చేవరకూ ఇరు దేశాల సంబంధాలూ అంతంత మాత్రమే. 2017లో మోదీ మయన్మార్‌ను సందర్శించారు. మన దేశానికి మయన్మార్‌తో 1,643 కిలోమీటర్ల పొడవునా అంతర్జాతీయ సరిహద్దు ఉంది. ఇందులో ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ (520 కి.మీ.), నాగాలాండ్ (215 కి.మీ.), మిజోరం (510 కి.మీ.), మణిపూర్ (398 కి.మీ.)ఉన్నాయి. 2021లో తిరిగి సైనిక పాలకులు అధికారం చేజిక్కించుకున్నాక మన దేశం గతంలో మాదిరి మయ న్మార్‌ను ఏకాకిని చేయాలనుకోలేదు. నిరంతరం సంబంధ బాంధవ్యాల్లో ఉంటే అక్కడ ప్రజాస్వామ్య పునరుద్ధరణకు అది దోహదపడుతుందనీ, దాంతోపాటు సరిహద్దు భద్రత విషయంలో మన ప్రయోజనాలు నెరవేరుతాయనీ భావించింది. దానికితోడు మయ న్మార్‌ను దూరం చేసుకుంటే అది చైనాకు దగ్గరకావటం మినహా సాధించేదేమీ ఉండదని కూడా అనుకుంది. అందుకే కావొచ్చు... సైనిక చీఫ్ పదవి వదులుకుని, దేశాధ్యక్షుడైన రెండు నెలల్లోనే తన తొలి విదేశీ పర్యటనకు మిన్ మన దేశాన్ని ఎంచుకున్నారు. నిరుడు డిసెంబర్, ఈ ఏడాది జనవరి మధ్య జరిపిన ఎన్నికల్లో మిన్ భారీ ఓట్లతో విజయం సాధించారు. దాదాపు అన్ని విపక్షాలనూ ఎన్నికల్లో పాల్గొననీయకపోవటంవల్ల ఇది సాధ్యమైంది. ఆ సంగతలావుంచి మయన్మార్‌తో కుదిరిన ఒప్పందాలు మన దేశానికి వ్యూహాత్మకంగా, భద్రతాపరంగా మేలుచేసేవే. అంతర్జాతీయ కరెన్సీ బదులు మన రూపాయి, మయన్మార్ క్యాట్‌లలో లావాదేవీలు జరుపుకోవాలనీ... ఇంధనం, మైనింగ్, ఆగ్రో ప్రోసెసింగ్ రంగాల్లో సహకరించుకోవాలనీ నిర్ణయించుకున్నాయి. అలాగే నౌకా శ్రయ నిర్మాణంలో మయన్మార్‌కు తోడ్పడేందుకు అవగాహన కుదిరింది. ఈశాన్య రాష్ట్రాల్లో అలజడి రేపే సంస్థలకు ఆశ్రయం లభించకుండా చర్యలు తీసుకుంటామని మయన్మార్ హామీ ఇచ్చింది. వర్తమానంలో ఇరుగు పొరుగుమధ్య సర్దుబాట్లు తప్ప 'అనవసర' చాదస్తాలు ఉండబోవని ఈ పర్యటన నిరూపించింది.

# యుద్ధం ఉన్నట్టా... లేనట్టా?!



అయోమయాన్ని సృష్టించటానికీ, అవతలి పక్షంపై పైచేయి సాధించటానికీ ఎంతకైనా తెగించే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈసారి అమెరికన్ కాంగ్రెస్‌కు పెద్ద అబద్ధం చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇరాన్‌తో శత్రుత్వాన్ని ఆపి, అక్కడున్న సేనలనువెంటనే వెనక్కి పిలిపించాలని 215--208 ఓట్ల తేడాతో బుధవారం అమెరికన్ కాంగ్రెస్ తీర్మానించగా, 'అసలు యుద్ధం ఎక్కడుంది? అది ఏప్రిల్ మొదటి వారంలోనే ముగిసి పోయింది. ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అది కొనసాగుతోంది'అంటూ ట్రంప్ లేఖ రాశారు. ఇజ్రాయెల్‌తో కుమ్మక్కై, ఫిబ్రవరి 28న ఇరాన్‌పై మొదలు పెట్టిన దండయాత్ర ఇప్పటికీ ఆగలేదు. హోర్ముజ్ జలసంధి ఇంకా తెరుచుకోలేదు. తమ షరతులకు తలొగ్గితేనే ఒప్పందం సాధ్యమంటూ ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఈ తీర్మానానికి కొన్ని గంటలముందు కూడా అమెరికా దాడులకు ప్రతీకారంగా కువైట్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు చేసింది. కానీ ఈ ఘర్షణల్ని యుద్ధంగా పరిగణించరాదని ట్రంప్ భాష్యం చెబుతున్నారు. నిజానికి యుద్ధం ఆపాలని ప్రతినిధుల సభ ఆదేశించినంత మాత్రాన ట్రంప్‌కొచ్చే నష్టమేం లేదు. ఆ తీర్మానం చట్టపరంగా కీలకమైన చర్యే కావొచ్చు, కానీ ఆచరణలో అదే మంత పనికొచ్చేది కాదు. నలుగురు రిపబ్లికన్ సభ్యులు డెమాక్రాట్లతో చేయి కలపటంతో తీర్మానం ఆమోదం పొందింది. 1973లో వచ్చిన యుద్ధ అధికారాల చట్టంకిందకాంగ్రెస్ అనుమతి లేకుండా అధ్యక్షుడు యుద్ధంలోకి దిగితే, రెండు నెలల్లో దాన్నిముగించాల్సి ఉంటుంది. ఒకవేళ యుద్ధం ఇంకా కొనసాగించాల్సిన అవసరం ఉందని భావిస్తే మరో 30 రోజులు పొడిగించటానికి అధ్యక్షుడికి వెసులుబాటుంది. కానీ అటు తర్వాత మాత్రం అసాధ్యం. ట్రంప్ రాసిన లేఖ ప్రకారం నిండా నెలకుమించి యుద్ధం సాగలేదు! కాల్పుల విరమణ అమల్లో ఉందంటే యుద్ధం లేనట్టేననీ, 'అవసరమైన'సందర్భాల్లో చేస్తున్న దాడుల్ని యుద్ధంగా పరిగణించరాదనీ యుద్ధ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్ వాదిస్తున్నారు. తలా తోకా లేకుండా మాట్లాడటంలో ట్రంప్ సిద్ధహస్తుడు. ఒకపక్క కాంగ్రెస్ చేసిన తీర్మానం దేశభక్తి రాహిత్యమంటూనే, అదే నోటితో అదెప్పుడో ముగిసిందని చెబుతున్నారు. ఆయన తర్కం ప్రకారం యుద్ధం చేయటమే దేశభక్తి అయితే, దాన్ని నిలి పేసిన తనకూ దేశభక్తి లోపించినట్టే. ఈ వాదప్రతివాదాల మాటెలావున్నా ఇలాంటి అధ్యక్షుణ్ణి నెత్తిన పెట్టుకున్నందుకు మున్ముందు ఆ దేశం భారీ మూల్యం చెల్లించక తప్పదు. ఈ నెలాఖరుతో యుద్ధం వంద రోజులకు చేరుతుంది. యుద్ధం ఆగేందుకు ఇప్పటికి నాలుగుసార్లు ప్రతినిధుల సభలో డెమాక్రాట్లు తీర్మానాలు పెట్టారు. కానీ మొదటి మూడుసార్లూ అవి వీగిపోయాయి. మూడోసారి తీర్మానమైతే 212--212తో ఎటూతేలకుండా ముగిసింది. ఈసారి అది నెగ్గినా ట్రంప్ తన తర్కంతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. యుద్ధంవల్ల ఇరాన్‌లో ఇంతవరకూ 3,400 మంది పౌరులు ప్రాణాలు కోల్పోగా, 13 మంది అమెరికన్ సైనికులు మరణించారు. 2,900 కోట్ల డాలర్లు ఖర్చయిందని పెంటగాన్ చెబుతుండగా, ఇదంతా ముగిసేసరికి లక్ష కోట్ల డాలర్లకు చేరుకుంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ట్రంప్ మూర్ఖత్వం ఇలాగే కొనసాగితే అమెరికా నిండా మునగటం ఖాయం. దాంతో పాటు డాలర్‌తో ముడిపడివున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నీ దివాలా స్థితికి చేరుకుంటాయి. ఇంధనం, ఎరువుల ధరలు ఆకాశాన్నంటి ఇప్పటికే ట్రంప్ రేటింగ్ నేల చూపులు చూస్తోంది. ప్రతినిధుల సభ చేసిన తీర్మానంవంటిదే రిపబ్లికన్ల ఆధిక్యతగల సెనేట్‌లో కూడా చేస్తే అమెరికా అధ్యక్షుడి సంతకం అవసరం లేకుండానే యుద్ధం ఆపాల్సి ఉంటుంది. అయితే అలాంటి సందర్భం ఎదురైనప్పుడు సైతం దాన్ని ట్రంప్ వీటో చేయొచ్చని రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారు. మొత్తానికి అత్యధిక మెజారిటీతో కాంగ్రెస్ తీర్మా నిస్తే తప్ప ఇవన్నీ పెద్దగా పనికొచ్చేవి కాదు. ఇప్పటికే మొత్తం ఓటర్లలో 64 శాతంమంది ట్రంప్ యుద్ధోన్మాదాన్ని గట్టిగా వ్యతిరేకిస్తున్నట్టు సర్వేలు చెబుతున్నాయి. తటస్థ ఓటర్లలో అయితే 73 శాతంమంది యుద్ధం ఆపాలని కోరుకుంటున్నారు. ఎవరెంతగా కోరుకున్నా ట్రంప్ మాత్రం స్వీయ వినాశనంవైపే అమెరికాను తీసుకుపోతున్నారు.

# ఒక పరీక్ష... లక్షల జీవితాలు!

### “అమ్మా... నాన్నా...
### మళ్లీ నీట్ పరీక్ష రాసే ధైర్యం నాకు లేదు.”

నాగ్‌పూర్‌లో ఆత్మహత్యకు ముందు 18 ఏళ్ల ఆకాంక్ష చతుర్వేది రాసిన ఈ వాక్యం నేటి భారత విద్యావ్యవస్థ వైఫల్యానికి అద్దం పడుతోంది. మధ్యప్రదేశ్‌లోని మౌగంజ్‌కు చెందిన ఆ యువతి డాక్టర్ కావాలనే కలతో నెలల తరబడి కష్టపడి మే 3వ తేదీన నీట్-2026 పరీక్ష రాసింది. పరీక్ష బాగా రాశానని, మంచి ర్యాంకు వస్తుందని కుటుంబ సభ్యులకు చెప్పింది. కానీ ప్రశ్నాపత్రం లీకైన నేపథ్యంలో పరీక్ష రద్దు చేస్తున్నట్లు జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టిఎ) మే 12న ప్రకటించగానే ఆమె ఆశల ప్రపంచం కుప్పకూలిపోయింది. జూన్ 3న వెలుగులోకి వచ్చిన ఆమె సూసైడ్ నోట్ దేశాన్ని కలచివేస్తోంది. వంటమనిషిగా పనిచేస్తున్న ఆమె తండ్రి కృష్ణకుమార్ చతుర్వేది మూడు సార్లు గుండెపోటుకు గురైనా, అప్పులు చేసి కూతురిని కోచింగ్‌కు పంపించాడు. కుటుంబం పెట్టుకున్న ఆశలు, తనపై ఉన్న బాధ్యత, మళ్లీ మొదటి నుంచి పోరాటం చేయాల్సిన పరిస్థితి ఆమెను తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేశాయి. చివరకు ప్రాణాలు తీసుకునేలా చేశాయి. నీట్ పరీక్ష ఒత్తిడి, పేపర్ లీకేజీలు, పరీక్షల నిర్వహణలో వైఫల్యాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల జాబితా ఆందోళన కలిగిస్తోంది. నీట్ పరీక్ష రద్దు తరువాత రాజస్థాన్‌కు చెందిన 22 ఏళ్ల ప్రదీప్ మేఘ్వాల్, బిహార్‌కు చెందిన శృతి కుమారి, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రితిక్ మిశ్రా, ఢిల్లీలోని అన్షికా పాండే వంటి విద్యార్థుల బలవన్మరణాలు కూడా ఇదే ఆవేదనను ప్రతిబింబిస్తున్నాయి. ఒక విశ్లేషణ ప్రకారం... గత ఐదేళ్లలో నీట్ ఒత్తిడిని తట్టుకోలేక 93 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. 2025లో అత్యధిక మరణాలు నమోదవగా, 2026లో ఇప్పటివరకు 14 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఇవి వ్యక్తిగత విషాదాలు కావు; మన విద్యా వ్యవస్థ సృష్టిస్తున్న సామాజిక సంక్షోభానికి సంకేతాలు. ఏటా 22.8 లక్షల మంది విద్యార్థులు వైద్య విద్య కోసం పోటీ పడుతుంటే, అందుబాటులో ఉన్న సీట్లు 59,416 మాత్రమే! అంటే ప్రతి 38 మందిలో ఒకరికే అవకాశం దక్కుతోంది. 2016లో నీట్‌ను ప్రవేశపెట్టినప్పుడు పారదర్శకత, సమాన అవకాశాలు, అవినీతి నిరోధం లక్ష్యాలుగా కేంద్ర ప్రభుత్వం చెప్పుకొచ్చింది. కానీ వాస్తవం భిన్నంగా ఉంది. ప్రశ్నాపత్రాల లీకులు, అవకతవకలు, ఫలితాల వివాదాలు వరుసగా వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. 2024లో ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఈ ఏడాది అత్యాధునిక భద్రతా ఏర్పాట్లు, ఏఐ నిఘా, 5జీ జామర్లు ఉన్నప్పటికీ ప్రశ్నాపత్రం అక్రమార్కుల చేతికి చేరింది. పరీక్ష రద్దు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మోదీ ప్రభుత్వ




పాలనాకాలంలో ఇప్పటివరకూ 79 పరీక్షల పత్రాలు లీకైనట్టు వస్తున్న వార్తలు ఆందోళనకరం. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడిన పరీక్షలను కూడా విశ్వసనీయంగా నిర్వహించలేకపోవడం కేంద్ర విద్యా యంత్రాంగ వైఫల్యానికి నిదర్శనం. ఈ ఏడాది సీబీఎస్ఈ పరీక్షల మూల్యాంకనంపై కూడా ఈ ఏడాది తీవ్ర విమర్శలు వచ్చాయి. లక్షలాది మంది విద్యార్థులు రీ-వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవడం, మూల్యాంకన వ్యత్యాసాలపై ఆరోపణలు రావడం, డేటా భద్రతపై సందేహాలు తలెత్తడం ఆందోళనకరం. దేశంలో అత్యంత కీలకమైన పరీక్షా వ్యవస్థలు నీట్, సీబీఎస్ఈ రెండింటిలోనూ ఇంతటి వివాదాలు చోటుచేసుకోవడం మోడీ ప్రభుత్వ వైఫల్యానికి సంకేతం. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. అయినా కేంద్ర ప్రభుత్వం తగిన విధంగా స్పందించకపోవడం బాధ్యతారాహిత్యం.వైద్య విద్య ప్రవేశపరీక్షను రాష్ట్రాల నుంచి తప్పించి జాతీయ పరీక్షగా నిర్వహించడంపైనా విమర్శలు ఉన్నాయి. రాష్ట్రాల విద్యా వాస్తవాలు, ప్రాంతీయ అసమానతలు,

స్థానిక అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా ఒకే పరీక్షతో అందరినీ కొలవడం సరైంది కాదు. ప్రస్తుతం ఉన్న కేంద్రీకృత విధానం విద్యార్థులను కోచింగ్ పరిశ్రమపై ఆధారపడేలా చేస్తోంది. విద్య జ్ఞాన సాధన ప్రక్రియ కాకుండా ర్యాంకుల వేటగా మారిపోయింది! ధనిక కుటుంబాల పిల్లలకు ఖరీదైన కోచింగ్ అందుబాటులో ఉండగా, సామాన్య కుటుంబాల ప్రతిభావంతుల పిల్లలు ప్రారంభం నుంచే అసమాన పోటీలోకి నెట్టబడుతున్నారు. ఈ విధానం మారాలి. పాఠశాల విద్యలో సాధించిన ప్రతిభ, ప్రవేశ పరీక్ష ఫలితాలు, ఇతర అర్హతలను సమన్వయం చేసే విధానాలను పరిశీలించాలి. వైద్య విద్యా సీట్ల సంఖ్యను పెంచాలి. విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి ప్రత్యేక సహాయక వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. విద్యను వ్యాపారంగా మార్చిన కోచింగ్ సంస్కృతిని నియంత్రించాలి. పరీక్షను ఎదుర్కొనే ధైర్యాన్ని చంపేయడం కాదు; సవాళ్లను ఎదుర్కొనే సత్తాను ఇవ్వడం విద్యావ్యవస్థ లక్ష్యంగానూ, లక్షణంగానూ ఉండాలి. ఒత్తిడితో నలగని విద్యార్థులను దేశానికి అందివ్వాలి.

# బెర్రీ కోకలో పిసీ వీపందం చూడు





ఇక్కడ గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా ఫోజ్ చూశాక ఫ్యాన్స్ ఇలా కామెంట్ చేస్తున్నారు. ప్రియాంక చోప్రా బెర్రీ రెడ్ చీరలో షో స్టాపర్ గా నిలిచింది. అయితే ఈ గెటప్ తో ఎక్కడ మెరిసింది? అని ప్రశ్నిస్తే.. తన సోదరుడు సిద్ధార్థ్ పెళ్లికి అటెండయిన పీసీ ఇలా వేడుక ఆద్యంతం సెంటరాఫ్ ఎట్రాక్షన్ గా నిలిచారు. ఈ వేడుకకు భారీగా సినీసెలబ్రిటీలు అటెండయ్యారు. దేశీ గర్ల్ ప్రియాంక చోప్రా జోనాస్ కి ఈ కస్టమ్ మేడ్ డిజైనర్ డ్రెస్ ని ఎవరు రూపొందించారు? అంటే ది గ్రేట్ మనీష్ మల్హోత్రా అని కూడా చెబుతున్నారు. ఆమె స్టైలిస్ట్ అమీ పటేల్ ఇన్‌స్టాలో - పీసీలీషియస్ బెర్రీలిషియస్ - అని రాసింది. నీష్ డిజైనర్ లుక్ సౌందర్యాన్ని సెలబ్రేట్ చేసుకున్నారు. బోల్డ్ అండ్ బెర్రీలీషియస్ కస్టమ్ మేడ్ చీర అదే రంగులో 3%ణ% ఎంబ్రాయిడరీ బ్లౌజ్‌తో పీసీ ఎంతో ఆకర్షణీయంగా కనిపించింది. ఈ చీర కూడా 3%ణ% ఎంబ్రాయిడరీ టోన్‌ను కలిగి ఉంది. ప్రియాంక తన సోదరుడు సిద్ధార్థ్ చోప్రా వివాహ వేడుకల కోసం ఈ చీరను ప్రత్యేకంగా డిజైన్ చేయించారని సమాచారం. ఆ ఒక్క లుక్కుతో పెళ్లిలో అహూతులను పీసీ కిల్ చేసింది. బెర్రీ చీరలో రియల్ స్టన్నర్ గా మెరిసిపోయింది. ప్రియాంక ధరించిన ఆభరణాలు అంతే ఖరీదైనవి. ఆకర్షణీయమైనవి.. చోకర్ -ముత్యాలు, కెంపులు -వజ్రాలతో అలంకరించిన లేయర్డ్ నెక్లెస్, డైమండ్ బ్రాస్‌లెట్‌తో కూడిన బల్గారి ఆభరణాలతో తన రూపాన్ని మరింత మెరుగుపరిచింది. రీగల్ సెట్ లో ప్రియాంక దేశీ గ్లామ్ లుక్ హీట్ పెంచింది. 2024లో మరో అద్భుతమైన మూవ్ మెంట్ ఇది అంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు. సెలబ్రిటీ స్టైలిస్ట్ అమీ పటేల్‌కు ప్రియాంక వైబ్‌ని ఎలా సెలబ్రేట్ చేయాలో సూపర్బ్ గా తెలుసు! అని కూడా కితాబిచ్చేస్తున్నారు. సెలబ్రిటీ హెయిర్ స్టైలిస్ట్ ఫ్లోరియన్ హురెల్ రూపొందించిన రెట్రో హై మెస్సీ బన్ హెయిర్ స్టైల్ ప్రియాంక లుక్ కి మరో అదనపు ఆకర్షణ. సిగ్నేచర్ బోల్డ్ లిప్ కలర్‌తో స్టైలిష్ లుక్‌ని వందశాతం ఫుల్ ఫిల్ చేసింది పీసీ. ఇన్‌స్టాలో షేర్ చేసిన ఫోటోలలో తన ప్రియమైన స్నేహితురాలు తమన్నా దత్ కూడా పాస్టెల్ చీరను ధరించి కనిపించింది. %-%బెర్రీస్ అండ్ క్రీమ్%-% అనే క్యాప్షన్ ని ఈ చీరకు ఇచ్చింది. చాలా సంవత్సరాలుగా ప్రియాంక మనీష్ డిజైన్‌లను ఉపయోగిస్తోంది. అతడు రూపొందించే అద్భుతమైన డిజైనర్ దుస్తుల్లో చీరకు స్థిరమైన స్థానం ఉంది. దోస్తానా చిత్రంలోని -దేశీ గర్ల్ - పాటలో పీసీ ధరించిన ఖరీదైన చీరను మనీష్ రూ పొందించాడు. నీలం ఉపాధ్యాయతో నిశ్చితార్థం చేసుకున్న ప్రియాంక సోదరుడు ఏప్రిల్ 2024లో రోకా వేడుకను జరుపుకున్నారు. ఈ వేడుకకు ప్రియాంక, నిక్ జోనాస్ , వారి కుమార్తె మాల్తీ మేరీ చోప్రా జోనాస్ హాజరయ్యారు.



# చూపు తిప్పనివ్వని 'రంగబలి' హీరోయిన్







మోడలింగ్ చేస్తూ 2019 లో ఎంటీవీ సూపర్ మోడల్ ఆఫ్ ది ఇయర్ లో నాల్గవ స్థానంలో నిలిచి అందరి దృష్టిని ఆకర్షించిన ముద్దుగుమ్మ యుక్తి తరేజా. మోడల్ గా చాలా కాలంగా పలు కమర్షియల్స్ లో నటిస్తూ ఉన్న ఈ అమ్మడికి తెలుగు లో నాగ శౌర్య హీరోగా నటించిన రంగబలి సినిమాలో నటించే అవకాశం దక్కింది. ఆ సినిమా కమర్షియల్ గా నిరాశ పరచడంతో యుక్తి తరేజా కి పెద్దగా ఆఫర్లు రావడం లేదు. ఆమె సోషల్ మీడియా ద్వారా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ మళ్లీ ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేస్తోంది. హర్యానా సమీపంలోని కైతల్ ప్రాంతంలో 2000 సంవత్సరంలో పర్వీన్ తరేజా, రీటా తరేజాలకు జన్మించిన యుక్తి తరేజా మోడల్ గా దక్కించుకున్న గుర్తింపు కారణంగా ఇమ్రాన్ హష్మి చేసిన లూట్ గయే మ్యూజిక్ ఆల్బం లో కనిపించింది. ఆ పాటలో స్క్రీన్ స్పేస్ తక్కువ ఉండటం వల్ల ఈమె కెరీర్ కి ఆ పాట కూడా పెద్దగా హెల్ప్ అయ్యింది లేదు. అయితే ఆ పాట వల్ల పలు ఆఫర్లు ఈ అమ్మడికి వచ్చాయి. మోడల్ గా మరింగా బిజీ అయ్యిందని ఆమె సన్నిహితులు అంటూ ఉంటారు. తాజాగా సోషల్ మీడియాలో అందమైన ఫోటోను షేర్ చేసింది. వైట్ టాప్ తో బ్లూ డెనిమ్ జీన్స్ షార్ట్ తో కన్నుల విందు చేసే విధంగా యుక్తి తరేజా కవ్విస్తూ ఉంది. ఈ స్థాయి అందం కు టాలీవుడ్ లో తగిన గుర్తింపు రావడం లేదు అంటూ కొందరు కామెంట్స్ చేస్తే మరి కొందరు మాత్రం చూపు తిప్పుకోనివ్వని ఈ అమ్మడి అందంకు ఇప్పుడు కాకున్నా ముందు ముందు అయినా తప్పకుండా మంచి ఆఫర్లు వస్తాయనే అభిప్రాయంను వ్యక్తం చేస్తూ ఫోటోలను లైక్ చేస్తూ తెగ కామెంట్స్ చేస్తూ షేర్ చేస్తున్నారు. గత సంవత్సరం ప్రేక్షకుల ముందుకు వచ్చిన రంగబలి సినిమాకు పవన్ బసంశెట్టి దర్శకత్వం వహించాడు. సుధాకర్ చెరుకూరి ఈ సినిమాను శ్రీ లక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్ పై నిర్మించాడు. విభిన్నమైన టైటిల్ తో వచ్చిన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి తిరస్కరణ ఎదురైంది. ఈ సినిమా లో నాగ శౌర్య, యుక్తి తరేజాలతో పాటు సత్య, షైన్ టామ్ చాకో, శరత్ కుమార్ మురళి శర్మ ఇంకా ప్రముఖ నటీనటులు నటించారు. కథ విషయంలో నిరాశ పరచినా కూడా కొన్ని పాత్రలు బాగున్నాయనే రివ్యూలు వచ్చాయి.

# లంగావోణిలో జగతి.. నడుముతోనే స్టన్ అయ్యేలా..





తెలుగు టెలివిజన్ రంగం లో ప్రత్యేక గుర్తింపు పొందిన నటీమ ణులలో జ్యోతి రాయ్ ఒకరు. 'జగతి' పాత్రతో ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, తన నటనతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చోటు సంపాదించుకుంది. ఇటీవల, జ్యోతి తన గ్లామర్ ఫోటోల ద్వారా సోషల్ మీడియాలో మరింత క్రేజ్ తెచ్చుకుంది. జ్యోతి తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించి, దర్శకుడు సుకు పూర్వాజ్‌తో వివాహం చేసుకుంది. తన పేరును జ్యోతి పూర్వాజ్‌గా మార్చుకున్న ఆమె, కొత్త పేరుతోనే కాదు, కొత్త లుక్‌తో కూడా ఆకట్టుకుంటోంది. కొన్ని రోజుల క్రితం మినీ డ్రెస్సులో ఆమె షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, ఆమె అందానికి ఫ్యాన్స్ ఫిదా అయిపోయారు. ఇక లేటెస్ట్ గా అమ్మడు నల్లని రంగు లంగా వోణిలో అందంగా దర్శనమిచ్చింది. గతంలో ఎన్నోసార్లు గ్లామర్ డ్రెస్సులో కనిపించిన జ్యోతి ఈ లుక్ లో ఇంకా అందంగా ఉందంటూ ఫాలోవర్స్ పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు. ఇంటర్నెట్‌లో జ్యోతి ఫోటోలను చూసిన అభిమానులు ఆమె స్టైల్, గ్లామర్ గురించి ప్రశంసలు కురిపిస్తున్నారు. మరింత అందంగా కనిపిస్తున్న ఆమె టాటూలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఫ్యాన్స్ ఆమె లుక్‌పై పాజిటివ్ రియాక్షన్లు ఇస్తున్నారు. అభిమానులను ఆకట్టుకుంటూ జ్యోతి తన కెరీర్‌లో కూడా బిజీగా ఉంది. టెలివిజన్‌లో 'గుప్పెడంత మనసు' సీరియల్ ద్వారా పాపులారిటీ పొందిన ఆమె, వెబ్ సిరీస్‌లు, సినిమాల్లోనూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. ప్రస్తుతం జ్యోతి తన భర్త సుకు పూర్వాజ్‌తో కలిసి ప్రముఖ చిత్ర దర్శకుడు రూపొందిస్తున్న 'ఏ మాస్టర్ పీస్' చిత్రంలో కీలక పాత్రలో నటిస్తోంది.పాటు, తన ఈ చిత్రం విజయవంతమైతే, జ్యోతి కెరీర్‌లో కీలక మలుపు తిరగవచ్చు. గ్లామర్‌తో నటనతో కూడా ప్రేక్షకులను మెప్పించడానికి జ్యోతి కృషి చేస్తోంది. తెలుగులో హీరోయిన్‌గా స్థిరపడాలని లక్ష్యంగా పెట్టుకున్న ఈ నటీమణి, భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు అందుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు.

# సామ్ ఏంటి ఇలా మారిపోయింది? ఏం జరుగుతోంది?



స్టార్ హీరోయిన్ సమంత.. ఈ మధ్య వార్తల్లో బాగా నిలుస్తోంది. మయోసైటిస్ బారిన పడ్డ తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చిన ఆమెను మళ్లీ సిల్వర్ స్క్రీన్ పై చూసేందుకు అభిమానులు ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. అయితే అమ్మడు ఎప్పుడో పూర్తి చేసిన సిటాడెల్ హనీ బన్నీ వెబ్ సిరీస్ మరికొద్ది రోజుల్లో స్ట్రీమింగ్ కానుంది. తన బ్యానర్ పై ఓ సినిమాను అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. మరిన్ని ప్రాజెక్టుల విషయంలో చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది సమంత. తన ఫ్యాన్స్ కోసం ఎప్పటికప్పుడు కొత్త పిక్స్ షేర్ చేసుకుంటోంది. హెల్త్ కు సంబంధించిన పలు విషయాలు పోస్ట్ చేస్తుంటుంది. అదే సమయంలో ఈ మధ్య ఓ స్పెషల్ అప్డేట్ అని చెప్పి.. పికిల్ బాల్ లీగ్ లో చెన్నై ఫ్రాంచైజీని కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. అప్పుడు సామ్.. డెనిమ్ జీన్స్, బ్లాక్ కలర్ పోలో టీ షర్ట్ లో కాస్త ఫిట్ గా కనిపించింది. కానీ ఆమె బాగా సన్నబడిందని నెటిజన్లు కామెంట్స్ పెట్టారు. ఇటీవల ముంబైలో జరిగిన అనామికా ఖన్నా %శ ఎడవీ% కలెక్షన్ లాంచ్ ఈవెంట్ లో బ్లాక్ కలర్ డ్రెస్ లో సమంత తళుక్కుమంది. ఫ్యాబ్రిక్ పెయింట్ డిజైన్ డ్రెస్ అదిరిపోయినా.. సామ్ పిక్స్ చూసి మాత్రం షాకయ్యామని ఫ్యాన్స్ చెబుతున్నారు. పూర్తిగా ఆమె మారిపోయినట్లు కనిపిస్తోందని అంటున్నారు. అదేంటి ఎందుకు అలా అయిపోయిందని కామెంట్స్ పెడుతున్నారు. ఒక్కసారిగా బాగా వెయిట్ తగ్గడం చూస్తుంటే షాకింగ్ గా ఉందని అంటున్నారు. సామ్ ఫేస్ లో అప్పటి గ్లో కనిపించడం లేదని చెబుతున్నారు. ఒక్కొక్కరు ఒక్కోలా రెస్పాండ్ అవుతున్నారు. పర్సనల్ రీజన్ వల్ల సన్నబడిందా, లేక మయోసైటిస్ చికిత్సలో భాగంగా స్లిమ్ అయిందా అని అనుమానపడుతున్నారు. మరికొందరు సన్నబడినా.. హెల్దీగా ఉంటే చాలని చెబుతున్నారు. ఏదేమైనా సామ్ కొత్త లుక్ చూసి మాత్రం ఒక్కసారిగా అంతా షాకైనట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో సమంత కొత్త పిక్స్ తెగ చక్కర్లు కొడుతున్నాయి. ఇక సామ్ కెరీర్ విషయానికి వస్తే.. బాలీవుడ్ స్టార్ హీరో వరుణ్ ధావన్ తో కలిసి చేసిన సిటాడెల్ వెబ్ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీలో నవంబర్ 7వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కానుంది. అందుకు సంబంధించిన ప్రమోషన్స్ త్వరలో స్టార్ట్ కానున్నాయి. తన బర్త్ డే రోజు అనౌన్స్ చేసిన మా ఇంటి బంగారం మూవీలో లీడ్ రోల్ లో నటిస్తూనే ప్రొడ్యూస్ చేయనుంది సమంత. మరి ఈ సినిమాతో ప్రేక్షకుల ముందుకు ఆమె ఎప్పుడు వస్తుందో వేచి చూడాలి.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .